PDF Compressor Free Version

Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 14.12.2012, శుక్రవారం

సంపుటి : 32 సంచిక : 28

పేజీలు : 12, వెల : ₹ 4




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

## పాపం.. యన్.టి.ఆర్.



రాష్ట్ర రాజకీయాలను సామాన్యుడి గడప నుండి పేదవాడి గుడిసె దాకా తీసుకెళ్లిన తెలుగుతేజం నందమూరి తారక రామారావు. ఎవరెన్ని చెప్పినా ఎవరేమి ఆక్షేపించినా ఈ విషయం అక్షరాలా సత్యం.

ఆయన సినీ జీవితాన్ని పక్కనపెట్టి, రాజకీయ జీవితం వరకూ అవలోకిస్తే ఆయనకు ఆయనే సాటిగా నిలిచారు. తెలుగువారు తలదించుకోరాదంటూ నినదించారు. రాష్ట్ర రాజకీయాలనుంచి కేంద్రరాజకీయాలలోకి ఇక అడుగిడబోతున్న సమయంలో అల్లుడి వెన్నుపోటుతో కుదేలైపోయాడు. రాష్ట్ర ప్రజల్లో ప్రతి ఒక్క కుటుంబంలోని అందరు సభ్యులు గుర్తించగలిగిన, గుర్తుంచుకున్న పర్సనాలిటీ ఆయనది.

ఆయనతో రాజకీయ చదరంగం ఆడుకున్న కుటుంబ సభ్యులు, ఆయన మరణానంతరం కూడా ఆయన నీడలో రాజకీయలబ్ధి పొందారు. లక్ష్మీపార్వతితో సయోధ్యత నడిపిన దగ్గుబాటి వెంకటేశ్వరరావు ఇప్పుడు సారంగనీతులు వల్లిస్తున్నాడు. యన్‌టీఆర్ తనయ కాకుంటే పురంధేశ్వరి కేంద్ర రాజకీయాలలోకి చొచ్చుకొనిపోయి వుండేదా?


యన్‌టిఆర్ ఓ మహా వటవృక్షం. ఆ వృక్షం కూలిపోయినా చెట్టుపేరు చెప్పుకొని నందమూరి వారసుల కుటుంబాలు, అల్లుళ్ల కుటుంబాలు, వారి వారసులు, ఆఖరికి లక్ష్మీపార్వతి కూడా కంఫర్టబుల్‌గా ఆర్థికంగా, రాజకీయంగా బ్రతికేస్తున్నారు.

పార్లమెంట్‌లో యన్టీఆర్ విగ్రహ ప్రతిష్ఠాపన ప్రస్తుతం ఆయన కుటుంబసభ్యుల మధ్య (మిగతా 10వ పేజీలో)

## వై.యస్.ఆర్.కాంగ్రెస్

# తొందరపడొద్దు


### • ప్రజల్ని నమ్మలేం • కుట్రలని ఆపలేం



*రాజకీయాలలో గాలి శాశ్వతం కాదు... ప్రభంజనాలు ఎప్పుడూ వుండవు... సానుభూతి ఎల్లకాలం పనిచేయదు... సమయాన్నిబట్టి వేసే ఎత్తుగడలే విజయం సాధిస్తుంటాయి. అనుకూల వాతావరణం వున్నప్పుడు దానిని సద్వినియోగం చేసుకోవాలి. రాజకీయనాయకులకు అది చాలా ఉత్తమలక్షణం కూడా!*

రాజకీయాలలో ఆవేశం కాదు... ఆలోచన ముఖ్యం. తొందరపాటు కాదు... నిదానమే ప్రధానం. అయితే అన్ని వేళల్లో ఇది సరికాదు. కొన్ని సమయాలలో తొందరపాటు తప్పదు. ఎందుకంటే సమయానుకూలతను బట్టి ఆ దూకుడు ప్రదర్శించకపోతే, అలాంటి సమయం మళ్లీ రాకపోవచ్చు.

ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ వాతావరణంలో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకత్వం తొందరపడకతప్పేటట్లు లేదు. ఇప్పుడైతే రాష్ట్రంలో (మిగతా 10వ పేజీలో)



## ఢిల్లీ చలికి... వణికిన వెంకయ్య

తన వాక్చాతుర్యంతో విమర్శనా బాణాలతో ఎదుటివారికి చెమటలు పట్టించి మూడు చెరువుల నీళ్లు తాగించే మాటలమాంత్రికుడు, భారతీయజనతాపార్టీ ధీరుడు ముప్పవరపు వెంకయ్యనాయుడు మంగళవారం నాడు ఢిల్లీలో చలికి గడగడలాడి ముసుగువీరుడిలా పార్లమెంటుకు హాజరయ్యారు. వెంకయ్య వేషధారణ చూసి పలువురు ఎంపీలు, సహచరమిత్రులు సరదాగా నవ్వేసుకున్నారు.

## నెల్లూరు రాజీవ్ రహదారి(మినీబైపాస్)కి

# మోక్షంతోనే రక్షణ

- శరవేగంగా అభివృద్ధి
- ఆక్రమణలు సమృద్ధి



నెల్లూరు నగరంలో విచిత్రమైన సంస్కృతి వుంది. డ్రైనేజీ లేకుండానే, మంచినీటి పైపులైన్లు వేయకుండానే సిమెంటు రోడ్లు వేస్తారు. తర్వాత వాటి కోసం వేసిన సిమెంటురోడ్లను పగలగొడుతుంటారు. నగరంలో రాజీవ్‌మార్గ్‌గా పిలవబడే మినీబైపాస్‌రోడ్డు పరిస్థితి కూడా ఇలాగే కాబోతుందా? అన్నది ప్రశ్న.

నగరంలో అయ్యప్పగుడి నుండి ఆత్మకూరు బస్టాండ్ వరకు ట్రంకురోడ్డు ఆక్రమణలతో నిండిపోయి మరీ ఇరుకుదైంది. 70శాతం ట్రాఫిక్ ఈ రోడ్డు మీదే వుంటుంది. ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్‌లో ఈ రోడ్డుకు అనుసంధానంగా వుండడంతో ట్రాఫిక్ అంతా ఈ రోడ్డు మీదే! నెల్లూరు ప్రజలకు ట్రాఫిక్ సర్కస్ నుండి కాస్త ప్రత్యామ్నాయంగా వుండేది రాజీవ్ రహదారే(మినీబైపాస్). అయ్యప్పగుడి నుండి ఆత్మకూరు బస్టాండ్ దాకా 8 కిలో మీటర్ల దూరం గల రహదారి. ఈ రోడ్డును విస్తరిస్తే ట్రాఫిక్ మళ్లింపుకు ట్రంకు రోడ్డుకు ప్రత్యామ్నాయం కాగలదు. చాలావరకు ఈ రోడ్డు వల్లే ట్రంకురోడ్డులో ట్రాఫిక్ కొంతన్నా తగ్గింది. మినీబైపాస్‌ను అరులైన్ల రహదారిని (మిగతా 10వ పేజీలో)



PDF Compressor Free Version

## సమరానికి సై...



# 'వైకాపా'లో సమరోత్సాహం

ప్రస్తుతమున్న రాజకీయ వాతావరణంలో ఎన్నికల మాట వింటేనే కాంగ్రెస్, తెలుగుదేశంపార్టీలు మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికన్‌గున్యా వంటి రోగాలు ఒకేసారి వచ్చినట్లు వణికిపోతున్నాయి. ఎన్నికల భయంతో ఆ పార్టీలు అల్లాడిపోతుండగా వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు మాత్రం ఎన్నికల కోసం సమరోత్సాహంతో ఎదురు చూస్తున్నారు.

ప్రజల్లో జగన్‌హవా, వైయస్సార్ సానుభూతి బలంగా వున్నాయి. కాబట్టి ఏ ఎన్నికలొచ్చినా గెలుపు మాదే అన్న ధీమా ఆ పార్టీ శ్రేణుల్లో కనిపిస్తుంది. వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఆవిర్భవించాక జిల్లాలో కోవూరు, ఉదయగిరి అసెంబ్లీలకు, నెల్లూరు పార్లమెంటు స్థానానికి ఉప ఎన్నికలు, అలాగే స్థానిక సంస్థల శాసనమండలి నియోజకవర్గానికి సాధారణ ఎన్నిక జరిగింది. నెల్లూరు ఎంపీ స్థానం నుండి వైకాపా అభ్యర్థి దాదాపు 3లక్షల రికార్డుమెజార్టీతో గెలుపొందడమేకాక ఉదయగిరి, కోవూరు స్థానాలను మంచి మెజార్టీతో తమ ఖాతాలో వేసుకున్నారు. శాసనమండలి ఎన్నికలలో సైతం వైకాపా గట్టి పోటీ ఇచ్చింది. కేవలం 9ఓట్ల తేడాతో ఎమ్మెల్సీ స్థానాన్ని ఆ పార్టీ కోల్పోయింది.

వైకాపా బలప్రదర్శనకు రేపు జరగబోయే సహకార ఎన్నికలు వేదిక కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా 99సహకార సంఘాలున్నాయి. వాటిలో మళ్లీ డైరక్టర్‌లు వున్నారు. సహకార సంఘాల అధ్యక్షులు, డైరక్టర్‌లు మళ్లీ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్‌ను ఎన్నుకోవాల్సివుంటుంది. ఇప్పుడు 99సహకార సంఘాలలో పోటీకి వైకాపా సమాయత్తమవుతుంది. ఎక్కువ సహకార సంఘాలను, డైరక్టర్లను కైవసం చేసుకొని జిల్లా కేంద్ర సహకారబ్యాంకుపై తమ పార్టీ జెండాను ఎగురేయాలని ఆ పార్టీ నేతలు పావులు కదుపుతున్నారు. సహకార ఎన్నికల నుండే విజయయాత్రను ప్రారంభించాలని వాళ్లు ఉత్సాహపడుతున్నారు.



# 'కాంగ్రెస్'లో నిరుత్సాహం

ఏడేళ్ల క్రితం సహకార ఎన్నికలు జరిగాయి. ఆనాడు జిల్లాలో కాంగ్రెస్ వేగానికి ప్రతిపక్షం అడ్రస్ గల్లంతయ్యింది. ఆరోజు జిల్లాలో తెలుగుదేశం ఉనికే నిర్వీర్యమైపోయింది. కాంగ్రెస్‌కు ప్రధానపక్షం నుండి పోటీ ఎదురుకాలేదు. కాంగ్రెస్‌లోని రెండు వర్గాలు పోటీపడ్డాయి. చివరకు తెలుగుదేశం నుండి అరకొరగా గెలిచిన సొసైటీల డైరక్టర్లు కాంగ్రెస్‌లోని వర్గాలకే మద్దతు పలకాల్సివచ్చింది. చివరకు కాంగ్రెస్‌లోని రెండు వర్గాలలో నేదురుమల్లి వర్గానికి చెందిన వాకాటి నారాయణరెడ్డి ఛైర్మెన్ కాగా, ఆనం వర్గానికి చెందిన వేమారెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి వైస్‌ఛైర్మెన్ కాగలిగారు. ఆరోజు కాంగ్రెస్ అంత వూపులో వుండింది.

మరి నేడు... జనవరి చివర్లో, ఫిబ్రవరి మొదట్లో సహకార ఎన్నికలున్నాయి. ఏడేళ్ల క్రితం నాటి ఊపు, ఉత్సాహం కాంగ్రెస్ నాయకుల్లో ఏ మాత్రం కనిపించడం లేదు. వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ ప్రభావం కాంగ్రెస్‌పై బాగా పడింది. జిల్లాలోని పది నియోజకవర్గాలలో కాంగ్రెస్ కేడర్ చాలావరకు వైయస్సార్ కాంగ్రెస్‌లోకి వెళ్లిపోయింది. స్థానికంగా ఎక్కడికక్కడ నాయకుల్లోనూ అంత హుషారు లేదు. క్రితంసారి ఎన్నికలప్పటికి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి కొంత హుషారుగా వున్నాడు, కాబట్టి గూడూరు డివిజన్ అంతా కూడా ఆయన చూసుకున్నాడు. కాని ఇప్పుడు నేదురుమల్లి లేచే పరిస్థితుల్లో లేడు. రాజకీయ వ్యూహాలు పన్నడంలో ఆరితేరిన నెల్లూరురూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి అనారోగ్యంతో వున్నాడు. జిల్లా కాంగ్రెస్‌లో గట్టిగా పని చేయగలిగిందల్లా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే ఆదాల ప్రభాకర్‌రెడ్డిలే! నగర ఎమ్మెల్యే ముంగమూరు

(మిగతా 10వ పేజీలో)




# 'దేశం'లో దైన్యం

**కాంగ్రెస్‌వాళ్లు 9ఏళ్ల నుండి అధికారంలో వున్నారు కాబట్టి రేపు వాళ్లు గెలిచినా ఓడిపోయినా పెద్ద బాధ అనిపించదు. వైయస్సార్ కాంగ్రెస్ కొత్తపార్టీ. రేపు అధికారంలోకి వస్తామన్న ఆశ వుంది కాబట్టి వాళ్లకూ ఎన్నికలంటే ఉత్సాహం వుంది. కాని తెలుగుదేశం వాళ్ల పరిస్థితే మరీ దయనీయంగా వుంది.**

1999 అసెంబ్లీ ఎన్నికలో తప్పితే ఆ తర్వాత జిల్లాలో తెలుగుదేశానికి చెప్పుకోదగ్గ విజయమంటూ లేదు. 2004, 2009 అసెంబ్లీ ఎన్నికలలో దారుణ ఓటములు ఎదురయ్యాయి. వై.యస్ హయాంలో స్థానికసంస్థలు, సహకార ఎన్నికలలోనూ ఓటములే! ఇటీవల జరిగిన కోవూరు ఉపఎన్నికలలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్వయంగా పోటీచేసి ఓడిపోయారు. కాకపోతే గౌరవప్రదమైన ఓట్లు తెచ్చుకున్నాడు. కాని నెల్లూరు లోక్‌సభ, ఉదయగిరి అసెంబ్లీలకు జరిగిన ఉపఎన్నికలలో మాత్రం తెలుగు దేశం ఘోరంగా ఓడిపోయింది. మరీ లోక్‌సభ స్థానం నుండయితే తెలుగుదేశం అభ్యర్థికి డిపాజిట్ కూడా దక్కలేదు.

ఇక సహకార ఎన్నికల కోణంలో చూస్తే గత ఎన్నికలలోనే జిల్లాలో తెలుగుదేశం పార్టీ పూర్తిగా చేతులెత్తేసింది. చాలాచోట్ల ఆ పార్టీ తరపున అభ్యర్థులు పోటీకి కూడా నిలవలేదు. ఈసారి పరిస్థితి అంతకన్నా దారుణంగా వుంటుందేగాని మెరుగ్గా వుండదు. రెండుదఫాలుగా అధికారానికి దూరమై ఆ పార్టీ కేడర్ నిరుత్సాహంలో వుంది. పార్టీ తరపున సహకార సంఘాలకు పోటీ చేయడానికి అభ్యర్థులు ముందుకొచ్చే పరిస్థితులు కూడా లేవు. సహకార ఎన్నికలలో ఆ పార్టీ భవిష్యత్ అయోమయమే!

## మిల్లరు..



# 'ఆడి'స్తున్నారు!

- సవాల్‌చేస్తున్న మసూరి
- దగాపడ్డ రైతులు

*రైతు వద్ద వున్నప్పుడు పుట్టి ధాన్యం ధర 11వేల రూపాయలు. అది కూడా మంచి రేటంటే! ప్రభుత్వం మద్దతుధరకు సేకరించడం ద్వారానే రైతులకు ఆ మాత్రం గిట్టుబాటయ్యింది. మద్దతు ధరకు ధాన్యాన్ని అమ్ముకోలేకపోయిన రైతులు పుట్టిని 8వేలు, 9వేలకే దళారులకు అమ్ముకోవాల్సి వచ్చింది.*

ఖరీఫ్ సీజన్‌లో ఉత్పత్తి అయిన ధాన్యాన్ని జిల్లా అధికార యంత్రాంగం లక్షాయాభైవేల టన్నుల దాకా సేకరించింది. జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్, అప్పటి జాయింట్ కలెక్టర్‌గా వున్న సౌరభ్‌గౌర్‌లు ప్రత్యేకశ్రద్ధతో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి రైతులకు మద్దతుధరలు చెల్లించి ధాన్యాన్ని సేకరించారు. ధాన్యం సేకరణలో రైతులకు గోదాంల సమస్య వచ్చినా ఉన్నతాధికారులు వెంటనే దానిని కూడా పరిష్కరించారు.

ప్రభుత్వయంత్రాంగం సేకరించగా మిగిలిపోయిన ధాన్యాన్ని మిల్లర్లు, దళారులు తక్కువ రేట్లకు కొన్నారు. జిల్లాలో ధాన్యం ఉత్పత్తికి తగినట్లుగా నిల్వచేసుకోవడానికి గోడౌన్‌లు లేవు. అదీగాక రైతులకు నిల్వ చేసుకునే స్థోమత కూడా లేకుండా పోయింది. పైరు వేయడానికే అధికవడ్డీలకు అప్పులు తెచ్చి వుంటారు. బ్యాంకుల నుండి సరిగా ఋణాలు అందక రైతులు ప్రైవేట్ ఫైనాన్షియర్లను ఆశ్రయించాల్సి వస్తుంది. వచ్చిన పంటను వెంటనే అమ్మేసి వెనువెంటనే అప్పులు తీర్చేయాలనే ఆత్రంతో రైతులుంటారు. వాళ్లకు రేట్లు వచ్చేదాకా ధాన్యం నిల్వచేసుకుందామనే ఆలోచన కూడా వుండదు. ఇదే దళారుల పాలిట వరమైంది. వాళ్లు చెప్పిందే రేటు అన్నట్లు రైతులు తక్కువ ధరకే ధాన్యాన్ని అమ్ముకున్నారు.

ఇప్పుడు ధాన్యం మొత్తం మిల్లర్ల వద్దే వుంది. కాబట్టి ధాన్యం ధరను వాళ్లు నిర్ణయిస్తున్నారు. ఇప్పుడు ధాన్యం ధర పుట్టి 19వేల నుండి 20వేల రూపాయల దాకా వున్నట్లు తెలుస్తోంది. బయట మార్కెట్‌లోనూ కిలో జిలకరమసూరి బియ్యం 36 రూపాయలుగా వుంది. రైతుల వద్ద వున్నప్పుడేమో అమ్మబోతే అడవి అన్నట్లుగా వున్న ధాన్యం ధర మిల్లర్ల వద్దకొచ్చేసరికి కొనబోతే కొరివి అన్నట్లుగా మారింది.

## ఏ పోర్టు అన్నా...



# భూామ్ సున్నా!

జిల్లాలో దామవరం వద్ద ఎయిర్‌పోర్ట్ దాదాపు ఖాయమన్నారు. దీని కోసం రెండువేల ఎకరాలకు పైగా భూమిని సేకరించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి పలు ప్రాంతాలను పరిశీలించినా చివరకు దామవరం వైపే మొగ్గుచూపారు. దివంగత వై.యస్.రాజశేఖరరెడ్డి హయాంలోనే దామవరం వద్ద ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి అన్ని లాంఛనాలు పూర్తయ్యాయి. దీనికోసం మొదటి దశ నిర్మాణానికి వందకోట్లు మంజూరయ్యాయి. అయితే ఈ ఎయిర్‌పోర్ట్ కాంట్రాక్ట్ సత్యం గ్రూపుకు చెందిన మేటాస్ కంపెనీకి దక్కడం, ఆ సమయంలోనే సత్యం కంపెనీ కుంభకోణం వెలుగుచూడడంతో మేటాస్‌తో కుదుర్చుకున్న ఈ ఎయిర్‌పోర్టు ఒప్పందం కూడా రద్దయ్యింది. ఆ తర్వాత వై.యస్. మరణంతో ఈ ఎయిర్‌పోర్టు పూర్తిగా మరుగున పడిపోయింది. మళ్లీ ఇన్నిరోజులకు ఆర్థికశాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి చొరవతో ఎయిర్‌పోర్టు నిర్మాణంపై ఆశలు చిగురించాయి.

ఇక కేంద్రప్రభుత్వం మన రాష్ట్రంలో నిర్మించ తలపెట్టిన అతిపెద్ద ఓడరేవు మన జిల్లాకు దక్షిణ ప్రాంతమైన దుగరాజపట్నం వద్ద వస్తుందనుకుంటే ఉత్తరప్రాంతమైన రామాయపట్నం వద్ద మంజూరైంది. రికార్డుపరంగా రామాయపట్నం ప్రకాశంజిల్లాలో వున్నప్పటికీ భౌగోళికంగా నెల్లూరుజిల్లాకు దగ్గర. కావలికి చాలా సమీపంలో వుంది.

అయితే జిల్లాలో అటు ఎయిర్‌పోర్టు, ఇటు ఓడరేవు వస్తున్నాయన్నా కూడా మునుపటిలా ఆ సందడి కనిపించలేదు. గతంలో ఎయిర్‌పోర్టు వస్తుందంటే ఆ పరిసరాలలో భూములను ఎగబడి కొన్నారు. ఓడ రేవు వస్తుందంటే కొండలు గుట్టలపెట్టే భూములను కూడా లక్షలు, కోట్లు పోసి కొన్నారు. కాని ఇప్పుడు ఆ ఊసులేదు... ఆ ఉత్సాహం అసలే లేదు. అంతా 'రియల్'మాయ.

PDF Compressor Free Version



# వెంకన్న భక్తులపై "లాఠీ"

- లోపించిన చిత్తశుద్ధి
- అధికారుల మందబుద్ధి

తిరుమలేశుని భక్తుల సంఖ్య ఏపాటిదో ఆ దేవదేవుని కృపాకటాక్షాలకోసం క్యూలు కట్టే భక్తజనకోటి ఎంతవుందో తిరుమల తిరుపతి దేవస్థానాలలో పనిచేసే అధికారులకు, సిబ్బందికి తెలుసు. గతంలో ఎన్నో అనుభవాలు జరిగి భక్తులకు తీవ్ర అసౌకర్యం కలిగినా వీళ్లు మాత్రం మారడం లేదు. ఎంతటి జన సామర్థ్యాన్నైనా ఎదుర్కొగల ఆలోచన, చేయగలిగే సత్తా వీరికున్నా వీరు పట్టించుకోరు. భక్తులకు ఇబ్బంది కలగకుండా స్వామివారి సేవ చేయించగలిగే మేధస్సు వీళ్ళకున్నా, వీళ్ళు తమ సమయాన్ని అందుకోసం కేటాయించరు. వి.ఐ.పిల సేవకే వీరంకితమైతే, స్వామివారి దర్శన భాగ్యం కోసం సామాన్యుడు అల్లాడుతూనే వున్నాడు.

ఇలాంటి సంఘటనే మంగళవారం నాడు విశాఖపట్నంలో జరిగింది. ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా టి.టి.డి వైకుంఠద్వార దర్శన టిక్కెట్లను, టోకన్లలను ముందుగానే అందించడానికి శ్రీకారం చుట్టింది. ఇటీవల ముందుగా తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టగా అక్కడ భక్తులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొని టి.టి.డి అధికారులను శాపనార్థాలతో దీవించారు. ఇదే తంతు మళ్ళీ విశాఖలో జరిగింది. మంగళవారం ఉదయం నుండి టోకన్లను ఇవ్వనున్నారని తెలిసి సోమవారం రాత్రి నుండే భక్తులు విశాఖలోని ఈ-దర్శన్ కేంద్రం గేట్లముందు బారులు తీరారు. మంగళవారం మధ్యాహ్నానికి తీరిగ్గా వచ్చిన టి.టి.డి పెద్దలు ప్రాంగణం లోపల వున్న క్యూలైన్లలో వచ్చిన వారికి మాత్రమే టోకన్లు విక్రయిస్తామని ప్రకటించడంతో ఒక్కసారిగా భక్తులు గేట్లను తోసుకుని క్యూలో నిల్చుకునే ప్రయత్నం చేయడంతో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. మహిళలు క్రింద పడిపోయారు, వృద్ధులు నలిగిపోయారు, పసిపిల్లలున్న తల్లులు, తండ్రులు అల్లాడిపోయారు. క్రిందపడ్డ



ఎన్ని అనుభవాలు జరిగినా వీళ్లకు బుద్ధిరాదు. ఎన్నిసార్లు పత్రికలు వ్రాసినా, టీవీలు కోడైకూసినా వీళ్లలోని అహం వావదు. తిరుమల తిరుపతి దేవస్థానాలలో పనిచేసే అధికారులూ, సిబ్బంది తాము ప్రత్యమ్నాయ ప్రభుత్వాన్ని నడుపుతున్న వారిలా తల పొగరుతో ప్రవర్తిస్తూ ఆ ఏడుకొండలవాడి భక్తులను నిత్యం ఏదో ఒక ఇబ్బందికి గురిచేస్తూనే వున్నారు.

వారిని తొక్కుకుంటూ తమ స్వార్థం తాము చూసుకుంటున్న భక్తాగ్రేసరులపైన పోలీసులు లాఠీఝుళిపించారు. చిన్నా, పెద్దా, ముసలీముతకా అన్న తేడా లేకుండా అందరినీ ఉతికి ఆరేసారు. ఇది అతి దారుణమైన సంఘటన, తప్పు అధికారులదైతే శిక్ష సామాన్య భక్తుడికి పడింది. టీవీలలో ఈ సంఘటన చూసిన వారికే హృదయం ద్రవించిపోయింది. ఇక అక్కడ ఇక్కట్లు పడ్డ భక్తుల అవస్థలు ఎలావుండి వుంటాయో మనం వూహించుకోవచ్చు. అంగట్లో అన్నీ వున్నా అల్లుడి నోట్లో శని అన్నట్లుగా, ప్రత్యేక రోజుల్లో ఆపదమొక్కుల వాడిని దర్శించుకోవడానికి ఎంత మంది భక్తులు ఉబలాటపడతారో ఈ అధికారగణానికి తెలుసు, తాము ఇవ్వదల్చుకున్న టోకన్లను పోలీసు సహాయంతో ఎంతటి పగడ్బందీగా ఇవ్వచ్చో కూడా ఈ మేధావులకు తెలుసు, కానీ అలాంటి ఏర్పాట్లు వీళ్ళు చెయ్యరు, అందుకు కారణం నిర్లక్ష్యం. నిత్యం లక్షలాది సంఖ్యలో శ్రీనివాసుడిని దర్శించుకునే భక్తులంటే వీళ్లకి లెక్కేలేదు, భక్తులకు అవసరమైన ఏర్పాట్లను శ్రద్ధగా గమనించే చిత్తశుద్ధి వీరికి లేనే లేదు. గతంలో జరిగిన అనేక సంఘటనలు వీళ్లకు పాఠాలు నేర్పడంలేదు, కారణం తాము నియమింపబడింది భక్తుల సౌకర్యాలను పట్టించుకోవడానికే అన్న బుద్ధి వీళ్లకు లేదు...రాదు! ఇలాంటి వీళ్లకి ఆ దేవదేవుడే తగిన గుణపాఠం నేర్పాలి.

**కొసమెరుపు:** మొత్తం టోకన్లు 1200 వుంటే భక్తులు వేల సంఖ్యలో వచ్చారని, కాబట్టి తప్పు భక్తులదే తప్ప అధికారులది కాదని టి.టి.డి జె.ఇ.ఓ శ్రీనివాసరాజు మీడియాకి చెప్పారు. ఎన్ని టిక్కెట్లుంటే అంతేమంది రావాలని కోరుతున్న ఈ జె.ఇ.ఓ గారి తెలివి ఏపాటిదో, తమ సిబ్బంది తప్పులేదని కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్న ఈయన సామర్థ్యం ఏమాత్రమో మనం ఊహించుకోవచ్చు. విశాఖలో అంత ఘోరం జరిగిన తరువాత కూడా మిగిలిన ప్రాంతాలలో సైతం ముందుజాగ్రత్తలు తీసుకోకపోవడంతో వైకుంఠ దర్శన టోకెన్ల కోసం వెళ్లిన భక్తులకు నరకం కనిపించింది.

# నెల్లూరు వాహనదారులకు టోల్ రాయితీ

జిల్లాలో దాదాపు 180 కిలోమీటర్ల జాతీయ రహదారి వుండగా, ఈ మార్గంలో నాలుగు చోట్ల సున్నపుబట్టీ, వెంకటాచలం, బూదనం, సూళ్లూరుపేటలలో టోల్‌గేట్లు వున్నాయి. కావలి నుండి చెన్నైకి కారులో బయలుదేరామంటే ఈ నాలుగుచోట్లా టోల్‌గేట్లకు ఒక ట్రిప్పుకే రెండువందల రూపాయల దాకా సమర్పించుకోవాల్సి వుంటుంది. రానుపోను నాలుగు వందలవుతుంది. వాహనదారులకు ఇది భారంగా మారుతుంది. జాతీయ రహదారిపై రోజూ ప్రయాణించేవారికి ఇది ఇబ్బందవుతుంది. ఈ నేపథ్యంలో జిల్లాలో ఏపి26 రిజిస్ట్రేషన్ గల వాహనాలకు ఈ నాలుగు టోల్‌గేట్ల వద్ద టోల్‌ఫీజులో 50శాతం రాయితీ కల్పిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల జిల్లాలో వున్న 25వేల వాహనాలవారు లబ్ది పొందనున్నారు.




## ఉత్తరక్రియలు

మా ఇంటి దీపం

**మంకు వెంకటేశ్వర్లు గారు**

1.12.2012వ తేదీన స్వర్గస్థులైనారు.

వారి పవిత్రాత్మకు శాంతిచేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

భార్య: మంకు సుబ్బరత్నమ్మ

కుమారుడు - కోడలు
మంకు శ్రీనివాసులు - సుజాత

కుమార్తెలు - అల్లుళ్లు
డా॥ వి.కృష్ణవేణి - వి.విద్యాసాగర్ (USA)
యు.అన్నపూర్ణ - యు.మురళీధర్ (ఆస్ట్రేలియా)
జి.గీత - జి.విజయ్ (USA)

మనవళ్లు, మనవరాళ్లు
మంకు సంజన
రోహిత్, కౌశిక్ (USA)
స్నిగ్ధ, సౌగంధిక (ఆస్ట్రేలియా)
చేతన్, కావ్య (USA)

ఉత్తరక్రియలు
తేది. 15.12.2012
నెల్లూరు మినీబైపాస్‌లోని "దంరో" వెనుక ప్లాటినమ్‌హైట్స్ అపార్ట్‌మెంట్, సి-3 నందలి మా స్వగృహమందు జరుగును.


# నెల్లూరీయుల సేవే లక్ష్యంగా వేగా టీవీఎస్



టీవీఎస్ వేగా షోరూమ్‌ను ప్రారంభిస్తున్న టీవీఎస్ కంపెనీ వైస్‌ప్రెసిడెంట్ కె.వెంకటేశ్వర్లు

నెల్లూరు మినీబైపాస్‌రోడ్డులో వేగా టీవీఎస్ ఆటోమొబైల్స్ షోరూమ్‌ను ఈ నెల 7వ తేదీన టీవీఎస్ మోటార్ కంపెనీ లిమిటెడ్ వైస్‌ప్రెసిడెంట్ కె.వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర శాసనసభ్యులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, నరసింహకొండ దేవస్థానం ఛైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, మాజీమేయర్ ఎస్.భానుశ్రీ, టీవీఎస్ కంపెనీ ఏరియా సర్వీస్ మేనేజర్ ఎం.ఎస్.రాజేంద్ర, పి.తిరుపయ్యలు పాల్గొని ఈ షోరూమ్ అధినేత డా॥ వెంకట్‌ను అభినందించారు.

# చిన్నారీ... నీ చేతి బువ్వ అమృతం



ప్రజల్లో సానుభూతి సంపాదించుకొనేందుకు పేద పిల్లలను చేత్తో ముట్టుకొని, అనంతరం ప్రక్కనే డెట్టాల్‌తో చేతులు కడుక్కొనే వ్యక్తులున్న నేటి సమాజంలో, జిల్లా కలెక్టర్ హోదాలో వసతి గృహ విద్యార్థిని తన కంచంలో పెట్టుకున్న బువ్వను కలిపించి ముద్దచేయించి చేతిలో పెట్టించుకొని తృప్తిగా తిన్నాడు నెల్లూరుజిల్లా కలెక్టర్ బి.శ్రీధర్. ముద్దపెడ్తున్న బిడ్డ కళ్లల్లో మెరుపు, అందుకుంటున్న కలెక్టర్ ముఖంలో తృప్తిని మీడియా కెమెరా క్లిక్‌మనిపించింది.

ఈ సంఘటన నెల్లూరు నగరం పొదలకూరురోడ్డు గిరిజన సంక్షేమశాఖ బాలికల వసతి గృహంలో 9వతేదీ చోటు చేసుకుంది. సంక్షేమ వసతి గృహాలలో నూతనంగా ప్రవేశపెట్టిన మెనూను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రాత్రి ఆయన అక్కడి పిల్లలతో కలసి నేల మీద సహపంక్తి భోజనం చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం ఉపకార వేతనాలను పెంచిందన్నారు. అందులో భాగమే మెనూలో మార్పు అంటూ వివరించారు. పదిమంది విద్యార్థులతో మెస్ కమిటీ ఏర్పాటుచేశామని, వారికి వేర్వేరుగా ఈ-మెయిల్ ఐడీలు రూపొందించామని, వారికి ఎలాంటి సమస్య ఎదురైనా ఉన్నతాధికారులకు సమాచారం అందించవచ్చని వివరించారు. ఆయన వసతిగృహంలోని బాలికలతో కొంతసేపు ముచ్చటించి వారినుంచి వివరాలు సేకరించారు. బాగా చదువుకోవాలని అంటూ చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు వుందని పేర్కొన్నారు.

# నెల్లూరులో ప్రమాదకర ముఠాలు



అంతర్‌రాష్ట్ర, అంతర్‌జిల్లా గ్యాంగ్‌లు, దొంగలముఠాలు నెల్లూరును షెల్టర్ జోన్‌గా ఏర్పాటుచేసుకున్నారని, తమిళనాడుకు చెందిన ప్రమాదకరమైన దొంగల ముఠాలు జిల్లాలో సంచరిస్తున్నాయని, వీరేకాకుండా రాజస్థాన్, కర్నాటక, రాష్ట్రాల నుండి కూడా దొంగలు నెల్లూరు వచ్చివున్నారని, అలాగే ప్రకాశం, గుంటూరు నుంచి కూడా ముఠాలు నెల్లూరును కేంద్రంగా చేసుకొని దొంగతనాలు, దోపిడీలు కొనసాగిస్తున్నాయని నెల్లూరుజిల్లా యస్.పి. రమణకుమార్ చెప్పారు. జరిగిన దోపిడీలలో, దొంగతనాలలో సేకరించిన వేలిముద్రలు, ఇతర ఆధారాలతో ఈ విషయాన్ని గుర్తించామని, ఆటోడ్రైవర్లలా కొంతమంది నేరాలు చేస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా వుండాలని హెచ్చరించారు.

నేరస్థుల ఫోటోలు తీయించి నగరంలోని ముఖ్యకూడళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయనున్నామని, నగరంలో ఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీ జరిగినా వెంటనే అన్ని పోలీస్‌స్టేషన్ల నుండి పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొనేట్లుగా చర్యలు చేపట్టటం జరిగిందని, దొంగలు, లేదా అనుమానితులు కనిపిస్తే లేదా గుర్తిస్తే వెంటనే 100, 1090 నంబర్లకు ఫోన్ చేయాలని ఇటీవల మీడియా సమావేశం ద్వారా నగరవాసులను యస్.పి. కోరారు. కొంతమంది అంతర్ రాష్ట్ర, అంతర్‌జిల్లా అనుమానితులను అదుపులోకి తీసుకోవటం జరిగిందని వారి నుండి విషయసేకరణ జరుపుతున్నామని త్వరలో వివరాలు అందిస్తానని ఆయన తెలిపారు. సమావేశంలో ఏఎస్పీలు చంద్రశేఖర్, నాగేశ్వరరావు, నగర డీఎస్పీ వెంకటనాథ్‌రెడ్డి, హోంగార్డ్ డియస్పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

PDF Compressor Free Version






## వివేకా కోలుకోవాలి

నెల్లూరురూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి ప్రజల మనిషి. నిత్యం ప్రజల్లో వుండే నాయకుడు. ప్రజల వద్దకే వచ్చి సమస్యలు తెలుసుకునేవాడు. ఆయన గత కొన్ని రోజులుగా నెల్లూరులో లేకుంటే సందడే లేదు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన త్వరగా కోలుకుని మళ్లీ ప్రజలమధ్యకు రావాలని ప్రార్థిస్తున్నాము.

పి.మల్లిఖార్జున, నెల్లూరు.

## రాజధాని వారి అడ్డానా!

హైదరాబాద్ పాతబస్తీలో వున్న భాగ్యలక్ష్మి ఆలయాన్ని తొలగించాలని అక్బరుద్దీన్ ఓవైసీ అసెంబ్లీలో బహిరంగంగా అరుస్తుంటే ఇతర పార్టీలకు చెందిన ఏ ఒక్క ఎమ్మెల్యే దానిని ఖండించకపోవడం శోచనీయం. లౌకికత్వం అంటే ఒక మతానికే సంక్రమించేది కాదు. ఓట్ల కోసం ఎమ్మెల్యేలు నైతికంగా దిగజారనక్కరలేదు. భాగ్యలక్ష్మి దేవాలయం పురాతనమైనది. దానిని తొలగించాలనే డిమాండ్ వెనుక రాజకీయ స్వార్థం వుంది.

సి.రాజీవి, నెల్లూరు.

## కాంగ్రెస్ బానిసలు

ఎఫ్‌డిఐల వల్ల చిల్లరవర్తకులు బలవుతున్నారని తెలిసినా ములాయంసింగ్, మాయావతిలు పార్లమెంట్‌లో ఆ బిల్లు నెగ్గేందుకు పరోక్షంగా సహకరించారు. దీన్నిబట్టి బడుగుజీవుల పట్ల వాళ్లకెంత శ్రద్ధ వుందో అర్థమవుతుంది. తమ మీద వున్న అవినీతి కేసులను ఎత్తేయించుకోవడానికి వీళ్లు కాంగ్రెస్ బానిసలుగా మారారు.

తోటి నాగార్జున, చెన్నై.

## నార్వే ఆదర్శం

అతివృష్టి, అనావృష్టి చందాన ప్రపంచ ప్రభుత్వాల నడక నడుస్తుంది. నాగరిక దేశాల్లో పిల్లలపై అపార ప్రేమ వుంటుంది. అనాగరిక దేశాల్లో పిల్లలకు, పశువులకు పెద్ద తేడా లేకుండా చూస్తారు. మన దేశంలో అక్రమ సంబంధాల నేపథ్యంలో చాలామంది పసిబిడ్డలను చంపేస్తున్నారు. ఇలాంటి వాళ్లు నార్వే దేశంలో వుంటే ఉరిశిక్ష తప్పదేమో? నార్వేవాళ్లు పిల్లలను దేవుళ్లలాగా చూస్తారు.

వాస్తు రామచంద్ర, నెల్లూరు.

## 'ప్రభా'తం

ప్రజాసేవ చేయాలంటే రాజకీయాల్లో వుండాలి... డబ్బు సంపాదించాలంటే వ్యాపారాలు చేయాలి... సమాజంలో నలుగురికి సాయపడాలంటే స్వచ్ఛందసేవకుడు కావాలి... సమాజంలో అవినీతి, అన్యాయాలను ఎత్తి చూపాలంటే పాత్రికేయుడు కావాలి... అరాచకాలను అంతమొందించి ప్రజలకు రక్షణగా నిలవాలంటే పోలీసు కావాలి. ఒక్కో వృత్తికి ఒక్కో మార్గం, ఒక్కో లక్ష్యం వుంది.

ఈ ఆశయాలు, ఈ గమ్యాలన్నీ మరుగునపడ్డాయి. ఈరోజు ఏ వృత్తిలో వున్నా వారి లక్ష్యం, గమ్యం డబ్బు వైపే సాగుతుంది. ప్రజాసేవ చేయాలనుకుని ఈరోజు రాజకీయాల్లోకి ఎంతమంది వస్తున్నారు? నూటికి తొంభైఐదు శాతం మంది డబ్బు సంపాదించాలనే ఆశతోనే రాజకీయాలలోకి వస్తున్నారు. కోట్లకు కోట్లు కొల్లగొడుతున్నారు. స్వచ్ఛంద సంస్థలను స్థాపిస్తున్నారు. వాటి ముసుగులో మళ్లీ కోట్లు దోచేస్తున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను నిక్కచ్చిగా అమలుచేసి, ప్రజల సంక్షేమానికి పాటుపడాల్సిన బ్యూరోక్రాట్లు డబ్బు సంపాదనే లక్ష్యంగా పని చేస్తున్నారు. న్యాయాన్ని కాపాడాల్సిన న్యాయమూర్తులు సైతం డబ్బుకు ఏ విధంగా అమ్ముడుపోయారో మైనింగ్‌కింగ్ గాలి జనార్ధన్‌రెడ్డి బెయిల్ డీల్ సంఘటనలో చూసాము. ఇక దారి తప్పిన సమాజాన్ని సక్రమమార్గంలో పెట్టాల్సిన మీడియా సైతం వ్యాపార ధోరణులు సంతరించుకుంది. పత్రికలు, టీవీ ఛానళ్లు కూడా కార్పొరేట్ కంపెనీలలా తయారయ్యాయి. దేశంలో ఇన్ని రంగాలు, ఇన్ని రకాల వృత్తులవారు డబ్బు సంపాదనే ప్రధానలక్ష్యంగా చేసుకున్నప్పుడు, ఇక పోలీసుశాఖ నుండి నిజాయితీతో కూడిన పని తీరును ఆశించగలమా? ఒకప్పుడు పోలీస్‌శాఖలో చేరుతున్నామంటే... ఆ వృత్తి పట్ల గౌరవం, నిబద్ధతతో చేరేవాళ్లు. అరాచకాలను అంతమొందించి, గూండాలు, రౌడీల గుండెల్లో తాము సింహస్వప్నంలా వుండిపోవాలనే ఉబలాటం వుండేది.

### పోలీసు మారేదెప్పుడు




అవినీతి అంటూ లేని శాఖను చూడలేము. పోలీసుశాఖ కూడా అంతే! అయితే పోలీసు శాఖ మిగతా వాటికి భిన్నమైనది. పోలీస్ శాఖను గాడిలో పెట్టాలంటే ఆ శాఖ ద్వారా సమర్థవంతమైన పనిని చూడాలంటే రాజకీయ కబంధహస్తాల నుండి ఈ శాఖను విడిపించాల్సి వుంది.

కాని ఇప్పుడు ఒక కానిస్టేబుల్ ఉద్యోగంలో చేరేటప్పుడే.. నెలకొచ్చే జీతం కంటే నెల తిరిగేసరికి వచ్చే మామూళ్లు ఎంతుంటాయనే దాని గురించే ఆలోచిస్తున్నాడు. ఒక సబ్‌ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి పోస్టింగ్ కోసం, కోరుకున్న చోటకు బదిలీ కోసం లక్షల రూపాయలు లంచంగా ఇస్తున్నాడంటే, ఎస్.ఐగా ఎంత సంపాదిస్తున్నాడో అర్థం చేసుకోవాలి. జీతాలు వేలల్లో... లంచాలు లక్షల్లో... ఇదీ పోలీసు శాఖలో తీరు. అయితే ప్రభుత్వ యంత్రాంగంలో జరుగుతున్న మొత్తం అవినీతిని లెక్కలోకి తీసుకుంటే పోలీసుశాఖను మించిన శాఖలు ఎన్నో వున్నాయి. రెవెన్యూ, ఎక్సైజ్, కస్టమ్స్, ఇన్‌కంటాక్స్... ఇలా ఎన్నో శాఖలు పోలీసులకంటే ముందున్నాయి. ఈ శాఖల్లో జరిగే కోట్ల రూపాయల అవినీతి బయటకు కనిపించదు. కాని నడిరోడ్డు మీద ఒక ట్రాఫిక్ కానిస్టేబుల్ లారీని ఆపి డ్రైవర్ నుండి తీసుకునే పది, పాతిక రూపాయలే బహిరంగంగా అందరికళ్లకు కనిపిస్తాయి. కాబట్టే పోలీసు అవినీతి పత్రికలలో పతాకశీర్షికలకెక్కుతుంటుంది. అవినీతి నిరోధకశాఖ వాళ్లు ఒక ఎస్ఐను, సిఐను, రెవెన్యూఇన్స్‌పెక్టర్‌ను, విఆర్ఓను... ఇలా చిన్నసైజు అవినీతి చేపలను పట్టుకుంటారుగాని కలెక్టర్, ఎస్పీ, ఐజి వంటి స్థాయి అధికారులను పట్టుకున్న దాఖలాలున్నాయా? పట్టుబడనంత మాత్రాన వాళ్లంతా నీతిపరులేనా? అన్ని శాఖలలోనూ అవినీతి వేళ్లూనుకుపోయింది. కాకపోతే ఒక్కో శాఖ దశగా ప్రక్షాళన జరగాల్సివుంది.

రాష్ట్ర పోలీసుశాఖలో సంస్కరణలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టడం అభినందించదగ్గ విషయం. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత రాష్ట్రంలో పోలీస్ సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. డిజిపి దినేష్‌రెడ్డి ఇచ్చిన నివేదికను యథాతథంగా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం ముదావహం. ఈ సంస్కరణల ప్రకారం ఎస్ఐకు గెజిటెడ్ హోదా కల్పించారు. అంతకుముందు ఎస్ఐకి ఎమ్మార్వో ఆఫీసులో క్లర్క్ హోదా వుండేది. హోంగార్డుల వేతనాన్ని 200రూపాయల నుండి 300 రూపాయలకు పెంచారు. ప్రతి నియోజకవర్గానికి ఓ సబ్‌డివిజన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

అయితే ఈ సంస్కరణల వల్ల పోలీసుశాఖలో అదనంగా ఒరిగేదేమీ లేదు. పాత చింతకాయ పచ్చడిలాంటి చట్టాలను మార్చి పోలీసు వ్యవస్థను పూర్తిగా ఆధునికీకరించాలి. బ్రిటీష్ కాలం నాటి దొరవ్యవస్థను పోలీసు శాఖ నుండి దూరం చేయాలి. పోలీసు అవినీతిపరుడు కావడానికి ప్రభుత్వ విధానాలే కారణం. పోలీసుకు వచ్చే జీతం అతని కుటుంబఖర్చులకు ఏ మాత్రం సరిపోదు. ఒక పోలీసుస్టేషన్ పరిధిలో వివిపిలు పర్యటించినప్పుడు సదరు స్టేషన్‌పై ఆర్థికభారం మోపుతున్నారు. ఈ ఆర్థికభారాన్ని భరించాలంటే పోలీసులు లంచాలు గుంజక తప్పడంలేదు.

ముఖ్యంగా పోలీసు వ్యవస్థ రాజకీయ నాయకుల చేతుల్లో బందీగా వుంది. కానిస్టేబుల్ నుండి ఐ.జి, డిజిపిల వరకు కూడా పోస్టింగ్‌ల కొరకు, బదిలీల కొరకు ప్రజాప్రతినిధులను ఆశ్రయించాల్సి వస్తుంది. ప్రజాప్రతినిధుల సిఫార్సులతో పోస్టింగ్‌లు పొందిన వాళ్లు సదరు నాయకుల అడుగులకు మడుగులొత్తాల్సి వస్తుంది. ఇక వాళ్లు నీతి నిజాయితీలతో పనిచేసేదెక్కడ. సి.ఐ, డిఎస్పీ, ఎస్పీ స్థాయి అధికారులు కూడా లంచాలు బాగా వచ్చే ప్రాంతాలలో పోస్టింగ్‌ల కోసం ప్రజాప్రతినిధులకు లక్షలు లక్షలు లంచాలు ఇచ్చుకుంటున్నారు. మరి ఇలాంటి వారి నుండి నిజాయితీని ఆశించగలమా?

రాజకీయ కబంధహస్తాల నుండి పోలీసువ్యవస్థకు విముక్తి కల్పించాలి. పోలీసుకు హోదా, సరైన జీతం కల్పించాలి. ఆధునిక కోణంలో పోలీసుశాఖను ఆవిష్కరించాలి. అప్పుడే పోలీసు నుండి సమర్థవంతమైన పనిని చూడగలం.

## 'అంతర్'జాతీయం

- మూడు టెస్ట్‌ల సీరీస్‌ను ఇండియా 2–1 తేడాతో కోల్పోయింది. కోల్‌కత్తాలోని ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన మూడో టెస్ట్‌లోనూ ఇంగ్లాండ్ చేతిలో ఇండియా ఓటమిపాలై పరువు పోగొట్టుకుంది.
- ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్‌కు పంజాబ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. పంజాబ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం స్వర్ణోత్సవాల సందర్భంగా ఆయనకు ఈ పురస్కారం అందజేశారు.
- ఇరాన్ నుండి భారత్ చేసుకునే చమురు దిగుమతులపై అమెరికా ఆంక్షలు సడలించింది. చైనాతో సహా మరో తొమ్మిది దేశాలకు కూడా మినహాయింపు ఇచ్చింది.
- గుజరాత్ ఎంతో గొప్పగా పెరిగిపోతుందంటూ ఐశ్వర్యరాయ్ ప్రశంసించింది. ఎన్నికల ప్రచారంలోవున్న మోడీకి ఐశ్వర్య ప్రశంస ఒక వరంలా మారింది.
- సోనియాగాంధీ 66వ పుట్టినరోజు వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఢిల్లీలోని టెన్‌జనపథ్ వద్ద కాంగ్రెస్ నాయకులు మిఠాయిలు పంచి బాణాసంచా కాల్చారు.
- భారత్ 2030నాటికి ఆర్థికశక్తిగా ఆవిర్భవిస్తుందని అమెరికా ఇంటలిజెన్స్ సంస్థ నేషనల్ ఇంటలిజన్స్ కౌన్సిల్ పేర్కొంది. ప్రస్తుతం చైనా వున్న స్థాయిలో అప్పటికి భారత్ వుంటుందని ఆ సంస్థ పేర్కొంది.
- 2014 లోకసభ ఎన్నికలకు యూపిఏ ప్రచారసారథిగా రాహుల్ బాధ్యతలు చేపట్టనున్నారు. దీంతో తదుపరి యూపిఏ ప్రధాని అభ్యర్థి రాహుల్‌గాంధీయేనని కాంగ్రెస్ సంకేతాలిచ్చింది.
- పాఠశాల స్థాయిలోనే పిల్లలకు మానవహక్కులపై అవగాహన కల్పించాల్సిన అవసరం వుందని భారత రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ అభిప్రాయపడ్డారు. సోమవారం ఢిల్లీలో మానవహక్కుల దినోత్సవం సందర్భంగా జాతీయహక్కుల కమీషన్ ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడుతూ మానవహక్కులను ఒక పాఠ్యాంశంగా చేర్చాలన్నారు.
- బాలీవుడ్ నటి మనీషాకొయిరాలకు సోమవారం ఉదయం అండాశయ క్యాన్సర్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ముంబైలోని జస్లోక్ ఆసుపత్రిలో న్యూయార్క్ వైద్యులు ఈ ఆపరేషన్ నిర్వహించారు.

## వార్త వ్యాఖ్య

వార్త :- భారతీయుల్లో 90శాతం మంది ఇడియట్లే.
– జస్టిస్ కట్జూ వివాదాస్పద వ్యాఖ్య.
వ్యాఖ్య :- **కాబట్టే కదా విదేశీయులు 600ఏళ్లు ఏలారు.**

వార్త :- ఎఫ్‌డిఐలతో రైతులకు లబ్ధి. – ప్రధాని.
వ్యాఖ్య :- **అమెరికా రైతులకా?**

వార్త :- పెరిగిపోతున్న బిచ్చగాళ్లు. – హైద్రాబాద్‌లో పదివేల మంది.
వ్యాఖ్య :- **కిరణ్ సర్కార్‌లో ఈ సంఖ్య మరింత పెరగొచ్చు కూడా!**

వార్త :- ఈ మొద్దు ప్రభుత్వాన్ని వదిలించుకుందాం.
– పాదయాత్రలో చంద్రబాబు.
వ్యాఖ్య :- **దీన్ని వదిలించుకుని జగన్‌ను ఆహ్వానిద్దామంటారా?**

వార్త :- ఆ ముగ్గురు ఎంపీలను సస్పెండ్ చేయాల్సిందే!
– దేశంనేత తలసాని.
వ్యాఖ్య :- **వారితోపాటు చంద్రబాబును కూడా చేస్తేనే పార్టీకి భవిష్యత్తు.**

వార్త :- మేధోమధనం రెండురోజులు నిర్వహించాలి. – వి. హెచ్.
వ్యాఖ్య :- **అది మేధావులకు సంబంధించింది కదా... మీకెందుకు?**

వార్త :- నాణ్యతలేని విద్య నిష్ప్రయోజనం. – గవర్నర్ నరసింహన్.
వ్యాఖ్య :- **ఇప్పుడు దేశంలో అందరూ చదివేది ఇలాంటి విద్యే!**

వార్త :- శబరిమలైకు వెళ్లొస్తా. – సిబిఐ కోర్టులో మోపిదేవి పిటిషన్.
వ్యాఖ్య :- **జైలు నుండి బయటకు రావాలని మొక్కుకోవడానికా?**

వార్త :- పార్లమెంట్ తర్వాతే అఫ్జల్‌గురుపై తేలుస్తాం.
– హోంమంత్రి షిండే.
వ్యాఖ్య :- **పార్లమెంట్ కేసుకు పార్లమెంట్‌తోనే సెంటిమెంటా?**

వార్త :- కేంద్రంలో అసమర్థ నాయకత్వం.
– సమైక్యాంధ్ర జేఏసీ సదస్సులో కావూరి.
వ్యాఖ్య :- **మీకు మంత్రి పదవి వచ్చుంటే ఈ మాట అనే వారా?**

వార్త :- ఈ సర్కార్‌కు సమస్యలు పట్టవు. – సీపీఎం రాఘవులు.
వ్యాఖ్య :- **వాళ్ల పార్టీ సమస్యలు కూడా పట్టడం లేదు. ఇక ప్రజల సమస్యలు పట్టించుకుంటారా?**

PDF Compressor Free Version



సాగుతున్న విచారణ...

డబ్బు పోగొట్టుకున్న ప్రజలను ముంచుతారా? తేలుస్తారా?

# బాధితులకు మిగిలేది విచారమేనా?



ప్రజలనెత్తిన కుచ్చుటోపీ పెట్టి నెల్లూరుజిల్లాలో అధికారికంగా 400 కోట్లు, అనధికారికంగా ఎంతో? మనీస్కీం పేరుతో దండేశారు. ఆ దండిన వారిలో 15సంస్థల యాజమాన్యాలు, వారి ఏజెంట్లు, ఆ ఏజెంట్లకు సబ్‌ఏజెంట్లు ఇలా ఎంతో మంది వందల్లో విధులు నిర్వహించగా, వేలల్లో అత్యాశకుపోయిన జనం ఒకరికి తెలవకుండా మరొకరు నిధులు జమచేసేశారు. స్యూవిజన్ ఫౌండేషన్, హిమ్, భారతీయ ప్రేమ సదన్, టాగ్రో ఫార్మర్ సొసైటీ, యూత్ అండ్ స్ట్రెంత్, హెల్త్ ఫూర్ పీపుల్ ఇంటర్నేషనల్ ట్రస్ట్, వైఏఎస్, టిఏఎస్ ఇలా సంస్థలు ఏర్పాటుచేసి మహాజనం నుండి దండేశాయి. దండకాలప్పుడు ఎంత స్పీడ్‌గా చేశారో? అంతే స్పీడ్‌గా కొద్దిరోజులు చెల్లింపులు కూడా ఈ సంస్థల నిర్వాహకులు తిరిగిజేశారు. ఇలా వందకడితే వెయ్యిరూపాయలు వస్తున్న నేపథ్యంలో మౌత్ టు మౌత్ పబ్లిసిటీ బాగా జరిగింది. కడ్తామా? వద్దా? అను కుంటూ సంవత్సరం పాటు డైలమాలో వున్న వారందరూ, ప్రత్యేకించి ఇళ్లలోని ఆడవారు ఒక్క సారి తమ బొక్కసాలు ఖాళీచేశారు. ఇంకేముంది లక్షల్లో నుంచి కోట్లకు జమలు చేరాయి. ఈ సంస్థలకు ఇబ్బడిముబ్బ డిగా వస్తున్న డబ్బు కొంత మంది ఏజెంట్ల ఇళ్లల్లో కోట్ల రూపాయలు గోతాలసంచుల్లో వేసి మూలన కట్టిపడేశారు. ఇదీ పబ్లిక్‌గానే జరిగింది.

కష్టమంతా మనది. ఆదాయమేమో సంస్థలకు అందుతుంది. ఇలా ఎందుకు చేయాలని కొందరు మేధావులు, పేరు సంస్థలది వసూళ్లు మాత్రం వారివి అన్న ట్లుగా చేయసాగారు. ఇందులోంచే పాత ఖాతాదారులకు చెల్లింపులు చేయటంతో నమ్మకం జాస్తి అయి జమలు వరదల య్యాయి. నిధులు దారిమళ్లాయి. ఆస్తులు, కార్లు, ఏజెంట్ల జీవనశైలే మారిపోయింది. "ధనమెచ్చిన మదమెచ్చును" సామెత సరిగ్గా అతికినట్టుగా సరిపోయింది. తమకు అందుబాటులోని ప్రజా ప్రతి నిధులకు వాటాలందిస్తూ జల్సాలకు మరిగారు. డబ్బులుకట్టిన వారందరూ "దొంగకు తేలుకుట్టినట్లు" కిమ్మనకుండా వుండిపోయారు.

'రాజుగారు – దేవతావస్త్రాల' కథలో లాగా ఒకమ్మ, నాకే కావాల, డబ్బులు రావటంలేదు మీకందరికీ వస్తూనేవుంది కదా? వదినా అంటూ మొదలైన తొలిడైలాగు మిగిలిన వారందరినీ డైల మాలో పడేసింది. అప్పటి వరకూ ఆకుచాటు పిందెలా సాగుతున్న వ్యాపారం బట్టబయలైంది.

ఇంకేముంది ఒక ప్రక్క నుంచి ప్రజాప్రతి నిధులు, వీధి రాజకీయ నాయకుల నుండి, పోలీ సులు కూడా రంగప్రవేశం చేసి దొరికి నంత దోచేసుకున్నారు. చెల్లింపుల్లో గోల్‌మాల్‌లు మొదలయ్యాయి. ఎంత త్వరగా మనీస్కీం ప్రాచుర్యం చెందిందో అంత తక్కువ సమయంలోనే మదుపరు లను మోసపుచ్చేశారని ఒక్కసారి భగ్గు మంది. అధికారిక లెక్కాపత్రం లేకుండా జరిగిన లావాదేవీలు బజారునపడ్డాయి. తెలివిగల క్రైమ్ పోలీసులు రంగప్రవేశం చేసి ఒకవాలు ఊడ్చేశారు. కేసులు నమో దైనాయి. మనీస్కీం వ్యవహారాన్ని సిఐడి శాఖకు అప్పగించారు. విజయకుమార్‌ను డిఎస్పీగా నియమించారు. ఆయన ఇష్టారాజ్యంలో కోట్లాదిరూపాయలు ఆస్తులు, డబ్బు రికవరీలు చేయటం, కొంత మందిని అరెస్టులు చేయటం జరిగింది. సిఐడీశాఖ పరిశోధనకు అయ్యే ఖర్చుకు ఒక లిమిట్ అంటూ ఉండదు. దానినుపయోగించుకుంటూనే, మరో ప్రక్క సంస్థల ఏజెంట్లు, సబ్‌ఏజెంట్లు నుంచి స్వాధీనం చేసుకున్న దాంట్లో కోటికి వదిలక్షలవంతున జమలు చూపించినట్లు అనధికారికంగా పుకారు షికారు చేస్తుంది. ఆ మొత్తమే కోట్లకు చేరింది. అయితే దాన్ని బాధితులకు పంచిన దాఖలాలేదు. పోనీ ట్రెజరీలో జమచేశారా అంటే ఆ వివరాలు గోప్యంగానే వున్నాయి.

మొత్తంమీద 'పిట్ట పిట్ట తగువు పిల్లి దీర్చిందన్నట్లు", అంతా అయిపో యాక, స్వాహావర్వం డిజీపీ దినేష్‌రెడ్డికి చేరుకుంది. ఎంతైనా జిల్లా వాసికదా? తన స్వంత (మిగతా10వ పేజీలో)

# రాపూరు మీదుగా రైల్వేలైన్



సభలో ప్రసంగిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

కేంద్ర ప్రభుత్వ నిధులు 800కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ నిధులు 800కోట్లు మొత్తం 1600కోట్లతో వెంకటగిరి నడికుడి రైల్వేలైన్ వయా రాపూరుకు త్వరలో శంకుస్థాపన జరగనుందని రాష్ట్ర ఆర్థికశాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రకటించారు. 9వతేదీ రాపూరులో వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జాతీయ రహదారికి కూడా ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని వివరించారు. కృష్ణపట్నం ఓబులా పురంల మధ్య మరో రైల్వేలైన్ పనులు జరుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో రాపూరు వ్యవసాయ కమిటీ ఛైర్మెన్ చెన్ను బాలకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, కాంగ్రెస్‌పార్టీ నాయకులు శ్యామ్‌సుందరరెడ్డి, యం.ధనుంజయరెడ్డి, సీవీ శేషారెడ్డి, చేపూరు దేవకుమార్‌రెడ్డి ఇతర ప్రాంతీయ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ డాక్టర్...

# నిధులు బాగా బొక్కాడు

## విధుల నుండి సస్పెండయ్యాడు

విలువలకు వలువలు ఊడదీసి నగ్నంగా ఊరేగించడం ఎప్పుడో జరిగి పోయింది. దాని పర్యవసానం నేడు దేశం ఈ అవినీతి కూపంలో కూరుకు పోయి కునారిల్లుతోంది. ఎవడి దారిలో వాడు దేశంలోని నీతిని పీక్కుతింటూ కురూపిని చేస్తున్నాడు.

నీతికి జవజీవాలిచ్చే రంగాలైన విద్య, వైద్యాలను సైతం ఈ అవినీతి కబళించి కరాళనృత్యం చేస్తుందనడానికి తార్కాణంగా నెల్లూరుజిల్లాలోని మండలకేంద్రమైన కలువాయిలోగల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పనిచేస్తున్న డాక్టర్ సందానిబాషా నిధులు స్వాహా చేయడాన్ని చెప్పుకోవచ్చు. గతంలో అనంతసాగరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేసిన ఈయన 2009లో రెగ్యులర్ అయి వైద్యనిధులు నిర్వహించేవాడు. తరువాత కలువాయి పిహెచ్‌సికి వచ్చిన రెండు సంవత్సరాల్లో నిధులన్నీ స్వాహాచేశాడు. ప్రైవేటు ప్రాక్టీసు పెట్టుకొని, పి.హెచ్.సి విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆయనపై అనేక ఆరోపణలు రావడంతో జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్ ఆదేశంతో డియంహెచ్ఓ మాశిలామణి విచారించి సస్పెండ్ చేశారు. డాక్టర్ సందాని స్వాహా చేసిన నిధుల మొత్తం సుమారు 8లక్షలని తెలుస్తోంది.

# పారిశ్రామిక ఖిల్లాగా నెల్లూరు జిల్లా

## మెండుగా పరిశ్రమలు.. దండిగా ఉద్యోగాలు

పారిశ్రామిక రంగంలో నెల్లూరుజిల్లా గణనీయమైన అభివృద్ధి చెందుతుందని, రాష్ట్రంలోనే పారిశ్రామిక జిల్లాగా గుర్తింపు పొందిందని జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్ పేర్కొన్నారు. నెల్లూరు హోటల్ లియోలో కాన్‌ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఇండస్ట్రీ ఆధ్వర్యంలో 11వతేదీ జరిగిన పరిశ్రమల ప్రోత్సాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రధానంగా జిల్లాలో అనేక పరిశ్రమలు నెలకొల్పబడుతున్నాయని, తద్వారా ఉపాధి అవకాశాలు, తదితర మౌలికసదుపాయాలు ఏర్పడతున్నాయని అన్నారు. జిల్లాలో 4 స్పెషల్ ఎకనమిక్‌జోన్(ఎస్.ఇ.జడ్) వున్నా యని, ప్రధానంగా కృష్ణపట్నంపోర్టు, మేనకూరు వద్ద దాదాపు 20 నుంచి 30దాకా పరిశ్రమల యూనిట్లు, తడ వద్ద చిత్తూరు జిల్లాకు సంబంధించిన శ్రీసిటీ ఇండస్ట్రీ, మన్నవరం దగ్గర ఇండస్ట్రీ, అలాగే మాంబట్టులో అపాచి పరిశ్రమ, తదితర పరిశ్రమలు నెలకొన్నాయన్నారు. కృష్ణపట్నం వద్ద 15,000మెగావాట్ల థర్మల్ పవర్‌స్టేషన్ ప్రాజెక్ట్ 2,3సంవత్సరాలలో రాబోతుందని, అలాగే దగదర్తి వద్ద విమానాశ్రయం, ఇఫ్కో పరిశ్రమలు నెలకొల్ప బడుతున్నాయన్నారు. పారిశ్రామిక రంగంగా అభివృద్ధి చెందేందుకు జిల్లాలో అవసరమైన అన్ని సదుపాయాలు వున్నాయన్నారు. సి.ఐ.ఐ ఛైర్‌పర్సన్ సుచిత్ర కె ఎల్లా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పారిశ్రామికంగా అభివృద్ధి చెందేందుకు అవసరమైన సదుపాయాలు కల్పించి, పరిశ్రమలను ప్రోత్సహించేందుకు కాన్‌ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఇండస్ట్రీ ప్రముఖపాత్ర వహిస్తుందన్నారు.

దేశస్థాయిలో 500మంది సభ్యులు రాష్ట్రస్థాయిలో 35మంది సభ్యులు ఈ సంస్థలో వున్నారని తెలిపారు. సి.ఐ.ఐ వైస్‌ఛైర్మెన్ బి.అశోక్‌రెడ్డి సంస్థ నిర్వహించే కార్యక్రమాలకు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జి.యం ఎ.సుధాకర్, ఇమామి బయోటెక్ వైస్‌ప్రెసిడెంట్ టి.రాజరాజన్ తదితరలు పాల్గొన్నారు.

మానవహక్కులపై...

## అవగాహన అవసరం

తోపుడుబండ్లు, గంపల ద్వారా రోడ్ మార్జిన్‌లో వ్యాపారాలు చేసుకొనే నిరు పేదల సంక్షేమానికి కేంద్రప్రభుత్వం రూపొం దించిన ఫుట్‌పాత్ వ్యాపారుల జాతీయ విధానం 2004ను గూడూరు పట్టణంలో అమలు చేయాలని పలు స్వచ్ఛంధ సంస్థలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజాభ్యుదయ స్వచ్ఛంద సేవాసంస్థ అధ్య క్షులు దగ్గోలు సురేంద్రబాబు అధ్యక్షతన స్థానిక ధర్మరాజులస్వామి ఆలయంలో ఫుట్‌పాత్ వ్యాపారులకు రెండురోజుల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత సర్వోన్నత న్యాయస్థానం తీర్పును అనుసరించి ప్రభుత్వం ఫుట్‌పాత్ వ్యాపా రుల కోసం అనేక హక్కులను కల్పించిం దన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్య దర్శి ఉడతా శరత్‌యాదవ్, సమాఖ్య ప్రతి నిధి మేకా శివకుమార్, ఎం.రవీంద్రారెడ్డి, కనుపూరు రాజు, దాసరి భాస్కర్ తది తరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో చీకట్లు...

# ప్రయాణికులకు ఇక్కట్లు

బాధ్యతగల సంస్థలే బాధ్యతారాహిత్యంతో వ్యవహరిస్తున్నాయి. మొట్టికాయలు తింటేగానీ మేలుకోవటం లేదు. అందుకు తాజా ఉదాహరణే నెల్లూరు నగరంలోని ప్రధాన ఆర్టీసీ బస్‌స్టేషన్‌కు కరెంట్‌కట్, అంతేకాదు లక్షాయాభైవేల జరిమానా.

వివరాలలోకి వెళ్తే నెల్లూరు ప్రధాన ఆర్టీసీ బస్‌స్టాండ్‌కు 55కిలోవాట్స్ విద్యుత్ వినియోగించుకొనేందుకే అనుమతి వుంది. కాగా చాలారోజులుగా 90కిలోవాట్స్ విద్యుత్‌ను వినియోగించుకుంటున్నారు. ట్రాన్స్‌కో అధికారులు పలుమార్లు ఈ విషయాన్ని ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు, అయినా వారు ఖాతరు చేయలేదు. దాంతో ఒక్కసారిగా కరెంట్ కట్‌చేసి ఆర్టీసీకి షాక్ ఇచ్చింది ట్రాన్స్‌కో.

ఉలిక్కిపడిన ఆర్టీసీ అధికారులు జరిమానా విషయం ఏంచేశారో తెలిదుకానీ, ఆర్టీసీలో అద్దె చెల్లించే దుకాణాలకు కోత విధించారు. దీంతో అద్దె చెల్లిస్తున్న అంగళ్ల యాజమాన్యం లబోదిబోమంటుంది.

ఆర్టీసీ అధికారుల చర్యలు తుగ్లక్‌ను మరిపిస్తున్నాయి. ఆర్టీసీ ప్రయాణీకులకు, సిబ్బందికి, అద్దెకిచ్చిన అంగళ్ల అవసరాలు తీరేంత మేర 90కిలోవాట్స్ విద్యుత్ కోసం డిపాజిట్ చెల్లించకుండా, కోతలు విధించటం పరిపాలనా అస్తవ్యస్తతను సూచిస్తుంది. బస్టాండ్‌లో రాత్రిపూటల్లో లైట్లు పూర్తిగా వేయకుండా ఆపివేయటం, అధికారుల గదులు, సిబ్బంది కార్యాలయ ప్రాంగణాలలో బల్బులు, ఫ్యాన్లు తిరగనీయకుండా చేయటం ఎంతో తెలివితక్కువతనం. బస్టాండ్‌లో ప్రయాణీకులతో పాటు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారు కూడా వుంటారు. అటువంటి వారికి బస్టాండ్‌ను చీకటిచేసి మరింత వెసులుబాటు కల్గిస్తున్నారు ఆర్టీసీ అధికారులు. ఇది సరైన చర్యకాదంటూ దుకాణాల యజమానులు, ప్రయాణీకులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

PDF Compressor Free Version



# నకిలీ పోలీస్, ప్రెస్‌లపై పోలీస్ దాడి

## మరి యం.యల్.ఏ., యం.పి.ల సంగతో...

ఇది కొత్త మాట కాదు, మొదటిసారి అసలే కాదు. ప్రెస్‌తోనూ పోలీస్‌తోనూ ఏ విధమైన సంబంధంలేనివారు తమ వాహనాలపైన ప్రెస్ అనో లేదా పోలీస్ అనో స్టిక్కర్లు వేసుకోవడం, దర్జాగా ఒన్‌వేలలో సైతం చక్కర్లు కొట్టడం రివాజైపోయింది. ఈ విషయాన్ని గతంలో పోలీసుల దృష్టికి మీడియానే తీసుకొచ్చినప్పుడు తూతూమంత్రంగా దాడులు జరిపి పత్రికలకు ఫోజులిచ్చారు పోలీసోళ్లు. అయితే షరా మామూలే, కొద్దిరోజులకు మళ్లీ అదే తంతు, నకిలీ పోలీసులు, నకిలీ పాత్రికేయులు. ప్రింటింగ్ ప్రెస్ నడిపేవాళ్లు సైతం తమ వాహనాలకు 'ప్రెస్' అని స్టిక్కర్లు వేసుకుని తిరుగుతున్నారు. ఇక పోలీసుకు ఫ్రెండైనా లేదా పోలీసు కొడుకుకి మిత్రుడైనా తన వాహనంపై 'పోలీస్' అని రాయించేసుకుంటున్నాడు. ఇటీవల ఓ మోటారుసైకిల్‌పై ముందుభాగంలో 'పోలీస్' అని, వెనుక నంబర్‌ప్లేట్‌పై 'నేనింతే' అని రాసిన అక్షరాలు దర్శనమిచ్చాయి. కనీసం నంబర్ కూడా ఆ బైక్‌పైన ఎక్కడా కనిపించలేదు. ప్రెస్ లేదా పోలీస్ అని బోర్డుంటే చాలు, రాంగ్‌రూట్‌లో వెళ్లొచ్చు, నోపార్కింగ్‌లో పెట్టొచ్చు, త్రిబుల్ రైడింగ్ చేయొచ్చు, ఎక్కడన్నా ఎంట్రీ రెస్ట్రిక్షన్ వుంటే నేరుగా దూసుకుపోవచ్చు, పార్కింగ్ రుసుము చెల్లించకుండా కూడా పార్కింగ్ చేసుకోవచ్చు. ఇలాంటి సౌలభ్యాలు ఈ స్టిక్కర్లున్న వాహనాలకు మెండుగావున్నాయి.

## నెల్లూరు కబుర్లు

ఎందుకో, ఏమో ఈ వాహనదారులపైన మన ఎస్పీగారికి దొంగలపైన కూడా రానంత కోపమొచ్చింది. ఈ నకిలీ ప్రెస్, పోలీస్‌లను గుర్తించడానికి ప్రత్యేక బృందాలని ఏర్పాటుచేసి తనిఖీలు నిర్వహించారు. నకిలీలకు భారీగానే జరిమానాలను విధించారు. చాలా సంతోషం సార్, ఈ చర్యలను నకిలీ యం.యల్.ఏ., యం.పి.ల వాహనాలపైన కూడా తీసుకోండి. నెల్లూరులో టాక్సీ వాహనాలు సైతం ప్రజాప్రతినిధుల స్టిక్కర్లను తగిలించుకు తిరుగుతున్నాయి. గతంలోలాగా తూతూమంత్రంలా కాకుండా ఈ వ్యవహారాన్ని కొంచెం సీరియస్‌గా తీసుకోకపోతే దొంగలూ, హంతకులూ కూడా ఈ స్టిక్కర్లను తగిలించుకు తిరిగే ప్రమాదముంది సుమా...!



ఈ నెల 9వ తేదీన నెల్లూరు పొదలకూరురోడ్డులోని సాంఘిక సంక్షేమశాఖ గిరిజన బాలికల వసతిగృహాన్ని సందర్శించి విద్యార్థినులకు పుస్తకాలు, స్టేషనరీ అందజేస్తున్న నెల్లూరు నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్, పక్కన ఇతర అధికారులు.

# ప్రపంచ నాయకురాలు సోనియా



చిన్నారికి కేక్ తినిపిస్తున్న ప్రమిద శ్రీనివాసులు

నెల్లూరు దర్గామిట్ట లోని విశ్వభారతి అందుల పాఠశాలలో 9వ తేదీ జిల్లా టెలికాం అడ్వయిజరీ బోర్డు సభ్యుడు ప్రమిద శ్రీనివాసులు ఏఐసిసి అధ్యక్షురాలు సోనియా గాంధీ 66వ జన్మదినాన్ని పురస్కరించుకొని కేక్ కట్‌చేసి బాలబాలికలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోనియాగాంధీ ప్రపంచంలో అత్యంత గొప్ప నాయకురాలిగా ఎదిగిన ధీశాలిగా అభివర్ణించారు. ఆమె ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు మంచి గుర్తింపు నిచ్చిన శక్తిగా పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు కడివేదు శ్రీనివాసులు, బద్వేలు మాధవరెడ్డి, కందల రాధామాధవ, శ్రీధర్, పవన్‌నాయుడు, ఏ.వి.సుబ్బారావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## అరుదైన తారీఖు

ప్రతి సంవత్సరంలో ఒక నెల, ఆ నెలలో ఒక తేదీకి ప్రత్యేక విశిష్టత వుంటుంది. తేదీ, నెల, సంవత్సరం అంతా కూడా ఒకే సంఖ్యలో వుంటాయి. మొన్న 12వ తేదీన ఇలాంటి అరుదైన సంఖ్యాక్రమం వచ్చింది. 12-12-12... 12వ తేదీ 12వ నెల, 2012వ సంవత్సరం అన్నమాట. మళ్లీ వెయ్యేళ్లకుగాని ఇటువంటి తేదీ రాదు.

# రైల్వేఛార్జీల పెంపు వద్దు

ఆకాశాన్నంటుతున్న నిత్యావసర వస్తువుల ధరల నేపథ్యంలో పెరిగిన బస్‌ఛార్జీలు భరించలేక సామాన్య ప్రజలు రైల్వేలనే ప్రధాన రవాణా సాధనంగా ఆశ్రయిస్తున్నారని, కాబట్టి రైల్వేఛార్జీల పెంపు మానుకోవాలని రైల్వే యూజర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బొగ్గరపు కృష్ణమూర్తి, కార్యదర్శి కె.సుబ్బారెడ్డి జీవితకాలపు గౌరవాధ్యక్షులు జె.వి.కె.బాబు ఒక సంయుక్త ప్రకటనలో భారత రైల్వేశాఖ మంత్రి పవన్‌కుమార్ బన్సాల్, సహాయమంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డిలను కోరారు. రైల్వేల ఆధునీకరణకు, విస్తరణకు పటిష్టమైన భద్రతా చర్యలకు రైల్వేశాఖకు అవసరమైన నిధుల కోసం నిరుపయోగంగా వున్న రైల్వే భూములను వ్యాపార సరళిలో ఉపయోగంలోకి తెస్తే వేలకోట్ల రూపాయలు సమకూరుతాయని, అలాంటి ప్రత్యామ్నాయాలను ఎంచుకోవాలేకాని రైల్వే ఛార్జీలను పెంచవద్దని ఆ ప్రకటన ద్వారా వాళ్లు విజ్ఞప్తి చేశారు.

## నగరంలో పోలీస్ షికార్లు

నెల్లూరు నగర డీఎస్పీ వెంకటనాథ్‌రెడ్డి మంగళవారం టౌన్‌బస్సులో తిరుగుతూ నగరంలో ట్రాఫిక్‌ను పరిశీలించారు. నగరంలోని పలు కూడళ్లలో ట్రాఫిక్ ఏ విధంగా జామ్ అవుతుందో ఆయన ప్రత్యక్షంగా చూశారు. ఈ తనిఖీలో ఆయన వెంట ట్రాఫిక్ సిఐలు సురేష్‌కుమార్, వెంకటేశ్వర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

## నెల్లూరు శాస్త్రవేత్తకు..

# ప్రతిష్ఠాత్మక అవార్డ్




అవార్డునందుకుంటున్న డా॥ సతీష్‌రెడ్డి

నెల్లూరుజిల్లా ఆత్మకూరు తాలూకా మహిమలూరు గ్రామంలో జన్మించిన జి.సతీష్‌రెడ్డి ప్రఖ్యాత శాస్త్రవేత్త అయ్యారు. మన జిల్లాకు చెందిన ఆయనకు తమిళనాడు అన్నామలై యూనివర్సిటీ ఆధ్వర్యంలో 36వ నేషనల్ సిస్టమ్స్ కాన్ఫరెన్స్‌లో ప్రతిష్ఠాత్మకమైన "సిస్టం సొసైటీ ఆఫ్ ఇండియా విక్రమ్ అవార్డ్-2012" వరించింది. ఈయన డిఆర్‌డిఓలో క్షిపణివాహక శాస్త్రవేత్తగా ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు. అగ్ని-4, అగ్ని-5 క్షిపణుల ప్రయోగాలలో అసమాన ప్రతిభాపాటవాలు ప్రదర్శించినందుకుగాను సతీష్‌కి ఈ అవార్డు లభించింది.

# రంగడికి నాలుగులక్షలు ఆదాయం

నెల్లూరు శ్రీ రంగనాథునికి సెప్టెంబరు నెల నుంచి డిసెంబరు 10వతేదీ వరకూ భక్తులు హుండీలో వేసిన మొత్తం 4లక్షలా 14వేలా 713రూపాయలుగా ఆలయ కార్యనిర్వహణాధికారి నాగేశ్వరరావు ప్రకటించారు. ఎగ్జిక్యూటివ్ అధికారి పర్యవేక్షణలో ఆలయ ఇన్‌స్పెక్టర్ శైలేంద్ర, వీఆర్వో రామ్మూర్తి, ఆలయ ప్రధాన అర్చకస్వామి జగన్నాథాచార్యుల సమక్షంలో ఈ హుండీ లెక్కను తేల్చారు.

# తెలుగుకొచ్చిన తెగులు

తిరుపతిలో జరుగనున్న ప్రపంచ తెలుగుమహాసభల నేపథ్యంలో మొన్న జిల్లా కలెక్టరేట్‌లో నగరంలోని ప్రైవేట్ విద్యాసంస్థల కరస్పాండెంట్‌లతో జిల్లా రెవెన్యూ అధికారి బి.రామిరెడ్డి సమావేశం నిర్వహించారు. తెలుగుభాషపై నిర్వహించిన సమావేశం అది. ఇందులో పాల్గొన్న డిప్యూటీ డిఇఓ మాట్లాడేటప్పుడు ప్రారంభంలోనే "డియర్ హానరబుల్ కరస్పాండెంట్స్" అని ఇంగ్లీషులో సంబోధించిందంట. వెంటనే అక్కడున్న కరస్పాండెంట్లు "తెలుగు తెలుగు" అని అరిచేసరికి ఆమె వెంటనే సర్దుకుని "సారీ సారీ" అని అందట. దాంతో అక్కడున్న వాళ్లంతా ఘొల్లుమంటూ నవ్వాల్సి వచ్చింది. మన రోజువారీ భాషలోనే ఆంగ్లపదాలు మిక్సయ్యాయి. వాటిని మార్చడం ఎవరితరం.

## సంక్రాంతి కళ్యాణ్

# బెయిలుపై బయటకొచ్చాడు!



రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మనీస్కీం నిర్వాహకులను బెదిరించి డబ్బులు వసూలు చేశాడనే ఆరోపణతో కటకటాల పాలైన మాజీకార్పొరేటర్ సంక్రాంతి కళ్యాణ్ బెయిలుపై బయటకొచ్చాడు. అప్పట్లో ఈ కేసును దర్యాప్తు చేసి అనేక ఆరోపణలతో ప్రస్తుతం వి.ఆర్.లోవున్న డి.యస్.పి విజయకుమార్‌కి కళ్యాణ్‌తో లావాదేవీ కుదరకపోవడంతో అరెస్టు చేసినట్లున్నాడు. అసలు తనకే పాపం తెలియదని, తానెవరినీ బెదిరించలేదని వై.యస్.ఆర్. కాంగ్రెస్‌కి మద్దత్తు తెలుపుతున్నాననే నెపంతో తనను ఈ వివాదంలో ఇరికించారనేది కళ్యాణ్ వాదన.

ఏదిఏమైనా అరెస్టు చేసి 60రోజులు పూర్తవడంతో షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ జిల్లా జడ్జి ఎల్.శ్రీరామమూర్తి ఆదేశాలు జారీచేశారు. బెయిల్‌పేపర్స్ 10వతేదీ అందినప్పటికీ కొన్ని సాంకేతిక కారణాలవల్ల 11వ తేదీ కళ్యాణ్‌ని విడుదల చేశారు. ప్రతినెలా 1వతేదీ మళ్లీ 15వ తేదీ రెండవ నగర పోలీస్‌స్టేషన్లో హాజరై సంతకం చేయవలసి వుంటుంది.

## అంతర్జాతీయ ప్రమాణాలతో

# అనూష వాటర్‌ప్లాంట్



అనూష వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

నెల్లూరు, ముత్తుకూరు రోడ్డులో 9వ తేదీన అంతర్జాతీయ ప్రమాణాలలో కూడిన అనూష మినరల్ వాటర్‌ప్లాంట్‌ను రాష్ట్ర ఆర్థికశాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యంత ఆధునిక పరికరాలతో కూడిన మినరల్‌వాటర్ ప్లాంట్‌ను నెల్లూరులో నెలకొల్పడం ఆనందంగా వుందన్నారు. ప్లాంట్‌లోని 20 లీటర్ల క్యాన్ల విభాగాన్ని జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్, ఒక లీటర్ బాటిళ్ల విభాగాన్ని వాకాటి నారాయణరెడ్డి, వాటర్ ప్యాకెట్ల విభాగాన్ని నెల్లూరు నగర శాసనసభ్యులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డిలు ప్రారంభించారు.

కార్యక్రమంలో ప్లాంట్ అధినేతలు వేములపాటి కృష్ణమూర్తి, వేములపాటి శైలేంద్రనాథ్ మరియు వారి కుటుంబ సభ్యులు, మిత్రులు పాల్గొన్నారు.

PDF Compressor Free Version





ఈ నెల 9వ తేదీన రాపూరులో జరిగిన రాపూరు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో ఛైర్మెన్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న చెన్ను బాలకృష్ణారెడ్డి మరియు ఇతర డైరెక్టర్లు.

సింహపురి సమాచారం

• ముందుచూపుతోనే

# 'చిన్నారిచూపు'



'చిన్నారిచూపు' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్, డిఇఓ రామలింగం, డిఎం అండ్ హెచ్ఓ డా॥ మాశిలామణి

పాఠశాల పిల్లలకు దృష్టిలోపం(చత్వారం) లేకుండా చిన్నారిచూపు కార్యక్రమంలో అవసరమైన పరీక్షలు నిర్వహించి కంటిచూపు సక్రమంగా వుండేలా చూడాలని జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్ పేర్కొన్నారు.

నెల్లూరు పొదలకూరురోడ్డులోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రాజీవ్ విద్యామిషన్ ఆధ్వర్యంలో 10వతేదీ జరిగిన చిన్నారిచూపు ప్రారంభోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకొనే పిల్లలలో కంటిచూపు సమస్యలతో వున్న పాఠశాల విద్యార్థులను గుర్తించి వారికి ప్రాథమిక కంటిచూపు పరీక్షలు నిర్వహించి అవసరమైన కంటి అద్దాలు ఇంకా అవసరమైతే శస్త్రచికిత్సలు చేయించడం జరుగుతుందన్నారు. ఈ శస్త్రచికిత్సలు వేసవికాలంలో చేయిస్తామన్నారు. చిన్నారిచూపు కార్యక్రమం ద్వారా జిల్లాలో 2.50లక్షల మందికి ప్రాథమిక కంటిచూపు పరీక్షలు నిర్వహిస్తామని, ఇప్పటి వరకు దాదాపు 17,500 మందికి దృష్టిలోపం వున్నట్లు గుర్తించడం జరిగిందని, పిల్లలలో కొంత మందికి విటమిన్ల లోపం వలన టి.వి.లు సినిమాలు ఎక్కువగా చూడడం వలన కంటిచూపు సమస్యలురావడం జరుగుతుందని అన్నారు. పాఠశాలల పిల్లలకు కంటిచూపు పరీక్షలు నిర్వహించేందుకు చిన్నారిచూపు కార్యక్రమం ద్వారా జిల్లాస్థాయిలో వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా చిన్నారిచూపు కంటి పరీక్షల కేంద్రాన్ని కలెక్టరు ప్రారంభించారు. కొంతమంది పిల్లలను వారి కంటిచూపులో సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. జిల్లా విద్యాశాఖాధికారి యం.రామలింగం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా॥ మాశిలామణి, వైద్యాధికారి డా॥ మంజుల, రాజీవ్‌విద్యామిషన్ ఎ.పి.ఓ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# చందన, సియంఆర్‌లలో బంపర్ ఆఫర్స్



లక్కీడ్రా తీస్తున్న డా॥ జడ్.శివప్రసాద్, మాపూరి శ్రీనివాసరావు, రాజీయాడ్స్ పెంచలయ్య

క్రిస్టమస్, న్యూ ఇయర్, సంక్రాంతి పండుగలు సందర్భంగా మా సంస్థ ఖాతాదారులకు తగ్గింపు ధరలకు బంగారం, డైమండ్స్, గృహోపకరణాలు, కుటుంబానికంతా అవసరమయ్యే దుస్తులు అందిస్తున్నామని చందన, సియంఆర్ షాపింగ్‌మాల్, గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంల అధినేత మాపూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. 9వతేదీ లక్కీడ్రాలో గెలుపొందిన విజేతలకు నెల్లూరులోని చిన్నపిల్లల వైద్యనిపుణులు జడ్.శివప్రసాద్ చేతులమీదుగా బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మాపూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ బంగారు, డైమండ్ ఆభరణాలు తగ్గింపు ధరలకు ఇస్తున్నామన్నారు. పట్టు, ఫ్యాన్సీ, సూరత్‌శారీస్, రెడీమేడ్స్, కిడ్స్‌వేర్, చుడీదార్స్, గాగ్రాలపై 50శాతం డిస్కౌంట్ కల్పిస్తున్నామన్నారు. వస్త్రాలు, గృహోపకరణాలు 500రూపాయలకు, బంగారు ఆభరణాలు, వెండి సామాన్లు మూడువేల రూపాయలకు కొన్నవారికి గిఫ్ట్‌కూపన్లు అందజేస్తున్నామని వివరించారు. ఈ కూపన్లు డైలీ, వీక్లీలుగా డిప్ తీస్తామని డైలీ విజేతలకు ఎల్‌సీడీ టీవీ, వాషింగ్‌మిషన్, డీవీడీ ప్లేయర్, మైక్రోఓవెన్, గ్రైండర్లు అందజేస్తున్నామన్నారు. వీక్లీ డ్రాలో హీరో స్ప్లెండర్ మోటార్‌సైకిల్ ఇస్తున్నామన్నారు. బంపర్‌డ్రాలు క్రిస్టమస్‌నాడు ఒకటి, సంక్రాంతి నాడు రెండు జరుగుతాయని విజేతలకు హ్యుండాయ్ డిలైట్ ఇయాన్ కార్లను అందించనున్నామని పేర్కొన్నారు. ఖాతాదారులు, నెల్లూరు నగరపౌరులు, మహిళలు అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని మాపూరి కోరారు.

# హసీనా కేసులో రెడ్‌క్రాస్‌కు నోటీసులు

ప్రసవసమయంలో నెల్లూరు రెడ్‌క్రాస్ సంస్థ అందజేసిన హెచ్‌ఐవి పాజిటివ్ రక్తం ద్వారా తన జీవితానికి తీరని నష్టం జరిగిందంటూ నెల్లూరుకు చెందిన షేక్ హసీనా రాష్ట్ర వినియోగదారుల ఫోరంకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదుపై ఫోరం అధ్యక్షులు జస్టిస్ అప్పారావు, సభ్యులు భుజంగరావు, శ్రీషలతో కూడిన ధర్మాసనం స్పందించింది. 2011నవంబరులో శ్రీమతి షేక్ హసీనాకు సిజేరియన్ జరిగింది. డాక్టర్ల సలహా మేరకు ఆమె బంధువులు నెల్లూరు రెడ్‌క్రాస్ సొసైటీ నుంచి రక్తం తీసుకొనివచ్చారు. ఆ రక్తం హెచ్‌ఐవి పాజిటివ్ కావటంతో హసీనా ఆరోగ్యం పాడయింది. ఈ సంఘటనపై ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ నెల్లూరు రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ ద్వారా సరఫరా చేసిన రక్తంలో హెచ్‌ఐవి పాజిటివ్ ఉండటం వాస్తవమేనన్నారు. ఆ కమిటీ నివేదికలో ఈ ఘటన మానవ తప్పిదంగా పేర్కొన్నారు. న్యాయవాది వాదనలు విన్న ధర్మాసనం తీవ్రంగా స్పందించి రెడ్‌క్రాస్ సొసైటీ సెక్రెటరీ జనరల్‌కు, రాష్ట్ర సొసైటీకి, నెల్లూరుజిల్లా రెడ్‌క్రాస్‌శాఖకు నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణ 2013 జనవరి13 నాటికి వాయిదా వేసింది.

# రాజన్న ఓ జ్ఞాపకం కాకూడదు



రాజన్న రాజ్యాన్ని జ్ఞాపకంలా మిగిలిపోయేలా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమపథకాలనన్నింటినీ కదలనీయకుండా కట్టడి చేస్తుందని వైయస్సార్సీ గ్రామీణం నాయకుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి విమర్శించాడు. 10వతేదీ వై.యస్.జగన్ విడుదల కోసం ఆయన నెల్లూరు శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో పూజలు నిర్వహించారు. అంతకు ముందు కరెంట్ ఆఫీసు కూడలిలో అభిమానులు దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్సార్ పదవిలో వున్నంతకాలం దేవునిగా కొలిచినవారు విశ్వాసఘాతకంగా ఇప్పుడు ఆయన్ని చెడ్డవాడిగా చిత్రీకరించి జగన్‌పై అక్రమకేసులు బనాయించారని తీవ్రంగా ఆరోపించారు. రాజన్న జ్ఞాపకంలా మిగిలిపోకూడదని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చాడు. రాజన్న రాజ్యం తిరిగి తీసుకొని వచ్చేందుకు అందరం కలిసికట్టుగా కాంగ్రెస్‌పార్టీ భరతం పట్టాలని పిలుపునిచ్చాడు. కార్యక్రమంలో వైయస్సార్సీ నేతలు కే.వి.రాఘవరెడ్డి, తాటి వెంకటేశ్వర్లు, బి.శ్రీకాంత్‌రెడ్డి, నరహరి, కరణం హజరత్‌నాయుడు, పురుషోత్తం, మురహరి, పూజిత, నిర్మల, అరుణమ్మ, మమతారెడ్డి, లతారెడ్డి, మీనమ్మ, హసీనా, నరసింహ, జనార్ధన్, కొండారెడ్డి, నందాని, మహేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# పక్కాప్లాన్‌తోనే సబ్‌ప్లాన్

## - మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



సభలో ప్రసంగిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం వినూత్న రీతిలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కమిటీ ప్రవేశపెట్టి దళితుల, గిరిజనుల ఆర్థిక ప్రయోజనం కల్పించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర ఆర్థికశాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు రూరల్ మండలం కొత్తూరు వద్ద 9వతేదీ రుణాలు, పట్టాలు, దీపంకనెక్షన్లు పంపిణీ కార్యక్రమంలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ యు.పి.ఏ ఛైర్మెన్ సోనియాగాంధీ నాయకత్వంలో ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి ప్రభుత్వం విడుదలచేసే నిధులు పూర్తిస్థాయిలో ఖర్చుపెట్టి వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచేందుకు ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ క్రింద 27లక్షల మందికి 4500కోట్ల మేర మంజూరుచేసి మార్చి నుండి అందించడం జరుగుతుందన్నారు. కొత్తూరు పంచాయితీతోపాటు 10పంచాయితీలు నెల్లూరు కార్పొరేషన్‌లో కలిపేందుకు ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకొంటుందని 125కోట్ల వ్యయంతో సంగం బ్యారేజ్ నుండి మరో జలాశయం ఏర్పాటుచేయడం జరుగుతుందన్నారు. కొత్తూరు వద్ద 6600ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని, పూర్తిస్థాయిలో నిర్మించేందుకు అదనంగా 27కోట్లు మంజూరు చేశామన్నారు. 49గ్రూపులకు 1.20కోట్లు మేర రుణాలు మంజూరు చేశామని ఆనం అన్నారు. అలాగే గ్యాస్ కనెక్షన్లు కూడా లబ్ధిదారులకు అందజేశామన్నారు. కాంగ్రెస్ నాయకులు ఆనం విజయకుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్, నెల్లూరు నగరం శాసనసభ్యులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, శాసనమండలి సభ్యులు వాకాటి నారాయణరెడ్డి, కో-ఆపరేటివ్ సెంట్రల్‌బ్యాంక్ అధ్యక్షులు శ్యామ్‌సుందరరెడ్డి, నెల్లూరు ఆర్.డి.ఓ మాధవీలత తదితరులు పాల్గొన్నారు.


PDF Compressor Free Version



కదంబం

# అమ్మలా..!

కందిపాటి గోపాలరావు
నెల్లూరు. 96521 74640.



పనికిరానని
పారేసిన కాగితాల్ని
వీధిబాలుడు
పారిజాతాల్లా ఏరుకున్నట్లు
నడుస్తూ నేను
బజార్లో దృశ్యాలపైన
మనసు పారేసుకుంటాను.

ఆవు తీరిగ్గా కూర్చొని
నెమరేసినట్టు
ఒంటరిగా
దృశ్యాల్ని వడపోసుకుంటాను.

ఏదో ఒక దృశ్యం
విత్తనమై మొలకెత్తాక
నవమాసాలూ మోసినట్టు
రాత్రింబవళ్లూ ఎదలో మోసి
మాట్లాడే బొమ్మలాంటి కవితను
అమ్మలా నేనూ కంటాను.

ఇలా దృశ్యాలు నన్ను
అమ్మని చేస్తుంటే
లోకం కంటికి పిచ్చివాడినై
లోపలి కంటికి
పచ్చిబాలింతరాలౌతుంటాను.

# యూపిఏ విజయోత్సవసభలో చంద్రబాబుకు సన్మానం

గల్పిక

అది ఢిల్లీలోని టెన్‌జనపథ్. హాలులోని సోఫాసెట్‌లో రాహుల్‌గాంధీ కూర్చుని టీవీ చూస్తున్నాడు. అప్పుడే తెలుగు ఛానెల్‌లో 'పిట్టల దొర' సినిమాలోని 'పెళ్లెప్పుడవుతుంది బాబు... నాకు పిల్ల యాడ దొరుకుతుంది బాబు' అనే ఆలీ పాట వస్తుంటే రాహుల్‌బాబు ఆసక్తిగా చూస్తున్నాడు. అంతలో ప్రధాని మన్మోహన్‌సింగ్, కేంద్రమంత్రులు గులాంనబీ ఆజాద్, అంబికా సోని, ఆంటోని, చిదంబరం, చిరంజీవి వంటి నాయకులొచ్చారు. అప్పుడే పాల్వాయి గోవర్ధన్ రెడ్డి కాఫీకప్పులు ట్రేలో పెట్టుకుని వచ్చాడు. మన్మోహన్‌సింగ్ ఆయన్నుచూసి... ఈ డ్యూటీ ఇంతకుముందు వి.హెచ్.హనుమంతురావు చేసేవాడు కదా, ఇప్పుడాయన ఎక్కడికెళ్లాడు అని అడిగాడు. దానికి గోవర్ధన్‌రెడ్డి... ఆయన సేవలు మెచ్చి అమ్మగారు ప్రమోషన్ ఇచ్చారు. ఇప్పుడాయన కిచెన్ సెక్షన్‌లో మాస్టారు అని చెప్పాడు. వీళ్లు మాట్లాడుకుంటుండగానే సోనియాగాంధీ వచ్చింది. ఆమెను చూడగానే చిదంబరం... మేడమ్, రాహుల్‌బాబును చూస్తుంటే నా గుండె తరుక్కుపోతుంది. ఇంకో 8ఏళ్లు పోతే హాఫ్ సెంచరీ కొడతాడు. ఏవేవో చూడాల్సిన వయస్సులో టీవీలు చూస్తూ కాలక్షేపం చేస్తున్నాడు. దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసిన కుటుంబం మీది. కాని సంసారసుఖాలు త్యాగం చేయాల్సిన పని లేదు. ముందు అబ్బాయికి పెళ్లి చేయండి.. గొడ్డొచ్చిన వేళ... బిడ్డొచ్చిన వేళ అంటారు. కొత్తకోడలు అడుగుపెడితే ఆమెవల్ల మన పార్టీకి పట్టుకున్న అరిష్టాలైనా తొలగిపోతాయేమో చూద్దామని అన్నాడు. దానికి సోనియా... ప్రధాన మంత్రి హోదాలో పెళ్లి చేసుకోవాలనేది బాబు కోరిక. ఆ రికార్డు ఇంతవరకు దేశచరిత్రలో ఎవరికీ లేదంది. అది విని చిదంబరం మనసులో... ఇక ఆయనకు పెళ్లయినట్లేనని గొణుక్కున్నాడు. మన్మోహన్ అందుకుని... కల్యాణ మొచ్చినా, కక్కొచ్చినా ఆగదంటారు. దేనికైనా టైం రావాలి. కాబట్టి బాబు పెళ్లి ఏదో ఒక రోజు జరుగుతుంది. కాని రేపు జరగాల్సిన తంతు చూడండి. ఎఫ్‌డిఐ బిల్లును లోక్‌సభలో ఎలాగోలా గట్టెక్కించాం. రేపు రాజ్యసభలో ఓటింగ్ వుంది. సంఖ్యాబలం చూస్తే మనకు తగినంతగా లేదు. బిల్లు ఓడిపోతే మన పరువు పోతుంది. అమెరికా వాళ్ల ముందు తల ఎత్తుకోలేము అని అన్నాడు. ఈ విపత్కర పరిస్థితుల్లో మనల్ని గట్టెక్కించే సలహాలిచ్చేదెవరని సోనియా ప్రశ్నించింది. అప్పుడు గులాంనబీ ఆజాద్... ఒక్కడున్నాడు మేడమ్ అని స్టైల్ ఆఫ్ సింహపురి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి (63)కి ఫోన్ చేసాడు. వివేకా ఫోన్ ఎత్తి నీరసంగా హలో అన్నాడు. అవతల ఆజాద్... ఏం సోదరా అంత నీరసంగా వున్నావని అడిగాడు. ఆరోగ్యం బాగాలేక హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో వున్నానని వివేకా అన్నాడు. ఇంపార్టెంట్ పనిమీద మీకు ఫోన్ చేసాను. ఆరోగ్యం బాగా లేదంటున్నావు, విశ్రాంతి తీసుకో, నేను తర్వాత చేస్తానని ఆజాద్ ఫోన్ కట్‌చేయబోయాడు. అప్పుడు వివేకా... సార్, నా ఆరోగ్యం గురించి పట్టించుకోవద్దు. కాంగ్రెస్‌పార్టీ కోసం ఇప్పుడు ఢిల్లీకి రమ్మన్నా వస్తాను, ఆ పనేంటో చెప్పండి... నాకు చేతనైతే చేస్తాను అని చెప్పాడు. ఆజాద్ అసలు విషయం చెప్పాడు. అది విని వివేకా ఏం చేయాలో చెప్పాడు.

పక్కరోజు రాజ్యసభలో ఎఫ్‌డిఐల బిల్లు ప్రవేశపెట్టారు. లోకసభలో మాదిరిగానే రాజ్యసభలో కూడా... ఎఫ్‌డిఐలకు మేం వ్యతిరేకం, ఈ బిల్లు పాస్ అవుతుంటే మేం చూస్తూ వూరుకోలేము, కాబట్టి మేం వాకౌట్ చేస్తున్నామంటూ సభలో నుండి బహుజన సమాజ్‌పార్టీ, సమాజ్ వాదీ పార్టీ సభ్యులు వెళ్లిపోయారు. దాంతో హాజరైన సభ్యులతో ఓటింగ్ జరుపగా ఎఫ్‌డిఐల బిల్లు ఆమోదం పొందింది.

★★★★★

అది ఏఐసిసి కార్యాలయం. ఎఫ్‌డిఐల బిల్లు పాసైనందుకు యూపిఏ విజయోత్సవసభ నిర్వహిస్తుంది. సోనియాగాంధీ, మన్మోహన్‌సింగ్, కేంద్రమంత్రులు, కాంగ్రెస్ ఎంపీలే కాకుండా ములాయంసింగ్, మాయావతి, శరద్‌పవార్ వంటి నాయకులంతా హాజరైవున్నారు. వచ్చిన వాళ్లందరికీ పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి, వి. హెచ్. హనుమంతురావు, సర్వే సత్యనారాయణ, మధుయాష్కీలు జ్యూస్‌లు, స్వీట్లు, కాఫీ, టీలు అందిస్తున్నారు. సోనియా, మన్మోహన్‌సింగ్‌లు వచ్చినవారిని ఆత్మీయంగా ఆహ్వానిస్తున్నారు. అక్కడే ఓ పక్క పెళ్లిళ్లపేరయ్య ఒకరు రాహుల్ గాంధీకి కొందరు అమ్మాయిల ఫోటోలను చూపిస్తున్నాడు. ఇలా ఎవరి ధ్యాసలో వాళ్లు సందడిగా వున్నారు. అందరూ వచ్చాక సభ మొదలైంది. సోనియాగాంధీ, స్పీకర్ మీరా కుమార్, ఇంకా కొందరు కేంద్రమంత్రులు ప్రసంగించారు. ఎఫ్‌డిఐ బిల్లును పాస్ చేయించడానికి తామెంతగా కష్టపడ్డది తమ ప్రసంగాలలో చెప్పారు. చివరగా ప్రధాని మన్మోహన్‌సింగ్ మాట్లాడుతూ... 'విదేశీ' అనే పదానికి, మన దేశానికి ఎంతో అవినాభావసంబంధముంది. 600ఏళ్లు మనల్ని విదేశీయులే పరిపాలించారు. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో మనం(సోనియాను చూపిస్తూ) విదేశీయుల పాలనలోనే వున్నాం. నిద్రలేచింది మొదలు మనం వాడే సగం వస్తువులు విదేశీయులవే... మరి విదేశీ పెట్టుబడులు మాత్రం ఎందుకొద్దు. మనకు 'విదేశీ' అనేది బాగా కలిసొచ్చింది. అందుకే రాజీపడకుండా ఈ బిల్లును ఆమోదింపచేయించామని చెప్పాడు. తర్వాత ఆజాద్ లేచి... ఈరోజు పార్లమెంట్‌లో ఎఫ్‌డిఐల బిల్లు పాసై మనమంతా గర్వంగా తలెత్తుకుని తిరుగుతున్నామంటే ఈ విజయం వెనుక ఒకరి కృషి వుంది. వారిని సన్మానించుకోవడం మన ధర్మం అని చెప్పాడు. ఆజాద్ చెబుతున్నది తమ గురించేననుకుని మాయావతి, ములాయంసింగ్‌యాదవ్, శరద్‌పవార్‌లు లోలోన సంతోషిస్తూ సన్మానం స్వీకరించడానికి సిద్ధమయ్యారు. అప్పుడే వారి మీద ఆజాద్ పిడుగులాంటివార్తను వేసాడు. ఈ విజయానికి కారణమైన తెలుగుదేశం అధినేత చంద్రబాబును సన్మానం స్వీకరించాల్సిందిగా కోరాడు. ఆ మాటతో ములాయం, మాయావతి, శరద్ పవార్‌లు అవాక్కై అలాగే నోర్లు తెరిచారు. చంద్రబాబు మాత్రం వేదికనెక్కి కుర్చీలో కూర్చున్నాడు. కాంగ్రెస్ పెద్దలంతా ఆయనను గజమాల, దుశ్శాలువా, పూలకిరీటాలతో సత్కరించారు. ఆ సీన్ చూసిన మాయావతికి గ్యాస్‌ట్రబుల్ ఎక్కువై... ఎఫ్‌డిఐ బిల్లును గట్టెక్కించింది మేమైతే, చంద్రబాబుకు సన్మానం చేస్తారా? ఇది అన్యాయం కాదా అని ప్రశ్నించింది. అప్పుడు ఆజాద్... ఎఫ్‌డిఐ బిల్లుకు మీరు చచ్చినట్లు మద్దతు పలకాల్సిందే. లేదంటే ఓటింగ్‌కు గైర్హాజరు కావాల్సిందే. మీరు మా చేతుల్లో వున్నారు. కాని చంద్రబాబు అలా కాదు. రాజ్యసభలో బిల్లు ఆమోదం పొందడం కోసం తన ఎంపీలను హాజరుకాకుండా చేసారు. చంద్రబాబు నుండి ఈ మద్దతు మేం వూహించనిది. కాబట్టే ఆయనను సన్మానిస్తున్నాం అని చెప్పాడు. అది విని మాయావతి, ములాయం, శరద్‌పవార్‌లు చల్లబడ్డారు.

సభ ముగిసి అందరూ వెళ్లిపోయాక ఆజాద్, హైద్రాబాద్‌లోని వివేకాకు ఫోన్‌చేసి, థ్యాంక్స్ భయ్యా... నీవిచ్చిన సలహా పనిచేసింది. అయినా చంద్రబాబు మనకు సహకరిస్తాడని మీరంత ఖచ్చితంగా ఎలా చెప్పగలిగారని అడిగాడు. అందుకు వివేకా... కేంద్రంలో, రాష్ట్రంలో ప్రభుత్వాలు పడిపోకూడదనే ఆరాటం ఇప్పుడు మనకంటే ఆయనకే ఎక్కువుంది. కాబట్టి చచ్చినట్లు ఆయన మనకు సహకరించాల్సిందే అని చెప్పి ఫోన్‌పెట్టేసాడు.

★★★★★

# సర్వకవి సమ్మేళన ఆహ్వానం

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా 16వ తేదీన జిల్లా ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో జరుగు సర్వకవి సమ్మేళనంలో పాల్గొనేందుకు జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్ కవులందరినీ ఆహ్వానిస్తున్నారు. పాల్గొనదలచిన కవులు 20పదుసలు మించని కవితలను రెండుప్రతులు తీసుకొనిరమ్మని కోరుతున్నారు. కవితలు తెలుగు ప్రాభవాన్ని తెలియజేసే విధంగా ఉండాలి. 15వ తేదీలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని, అందుకోసం కవులు, కవయిత్రులు 98856 61727, 98855 53263, 98853 95823 నంబర్లలో ఆలూరు శిరోమణిశర్మ, బి.వి.నరసింహం, కిరణశ్రీలను సంప్రదించమని తెలిపారు.

# వైభవంగా కేతా అంకులు జయంతి

నెల్లూరు టౌనుహాలు వద్దగల వర్ధమాన సమాజం సమావేశ మందిరంలో ఈనెల 10న కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కేతా అంకులు 87వ జయంతి వైభవంగా జరిగింది. కార్యక్రమానికి బి.వి.నరసింహం అధ్యక్షత వహించగా కవి గుడి నారాయణబాబు, మేదర సంఘం నాయకులు శిరివెళ్ళ భాస్కర్‌లను ఘనంగా సత్కరించారు. మేదర సంఘం జిల్లా అధ్యక్షులు పోతేపల్లి శ్రీనివాసులు, ఆర్.వి.శేషయ్యనాయుడు, కృష్ణయ్య, విరుగు సుబ్రహ్మణ్యం, కేతా సుబ్బారావు, చక్రపాణి, దుర్గం మధుసూదన్, శ్రీనివాస్, మంగళగౌరి, సుధావాణి మొదలగువారు పాల్గొన్నారు.

# కార్తీకదీపాలతో శైవక్షేత్రాలు కళకళ




హరోంహర, హరోంహర...హరహరమహాదేవ పాహిమాం పాహిమాం అంటూ శివనామస్మరణతో కార్తీకమాసంలో చివరి సోమవారం జిల్లాలోని శైవక్షేత్రాలన్నీ మార్మోగాయి. ఆ భోళా శంకరునికి ఎంతో ప్రీతిపాత్రమైన కార్తీకమాసంలో సోమశిలలోని సోమేశ్వరాలయం, సంగంలోని సంగమేశ్వరాలయం, సిద్ధలయ్యకోన, నెల్లూరు మూలాపేటలోని మూలస్థానేశ్వరాలయం, నవాబుపేటలోని దుర్గామల్లేశ్వరాలయం, ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని కాశీ విశ్వేశ్వరాలయం, కొండాయపాళెంరోడ్డులోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరాలయం, పెద్దచెరుకూరులోని చంద్రమౌళీశ్వరాలయం మొదలగు ఆలయాలలో భక్తులు భక్తిశ్రద్ధలతో కార్తీకదీపాలు వెలిగించి ఆ దేవదేవునికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. భక్తులు మధ్యాహ్నం ఆలయ ప్రాంగణాలలోగల ఉసిరిచెట్ల క్రింద కుటుంబసభ్యులు, మిత్రబృందాలతో వనభోజనాలు చేసి ఆహ్లాదంగా, ఆధ్యాత్మిక ఆనందంతో సాయంత్రం ఆకాశదీపాలు వెలిగించి నక్షత్రదర్శనం చేసుకున్నారు. వివిధ శైవక్షేత్రాలలో పాలు, పెరుగు, పంచదార, తేనె, నెయ్యి, కొబ్బరినీళ్లు రకరకాల ఫలములతో తయారుచేసిన పంచామృతాన్ని నైవేద్యంగా సమర్పించి లక్షబిల్వార్చన, సహస్రనామార్చన మొదలగు పూజలు విశేషస్థాయిలో నిర్వహించారు. అన్ని ఆలయాలు కార్తీకదీపాల శోభతో విరాజిల్లాయి.

PDF Compressor Free Version



## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఆర్థికాభివృద్ధి ప్రయత్నాలు అనుకూలించవు. వృత్తి వ్యాపారాలలో ఆదాయం తగ్గుతుంది. అనుకున్న పనులు కొన్ని వాయిదాపడటం, కొన్ని నిదానంగా జరగడం ఉంటుంది. సమస్యలను ఓపికతో నెట్టుకొని రావాలి. మీకు సంబంధించని విషయాలకు దూరంగా ఉండండి. కుటుంబసభ్యులకు అనారోగ్య బాధలుంటాయి. అగ్రిమెంట్లు, సంప్రదింపులకు జాగ్రత్తపడవలసి ఉంటుంది.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

వృత్తి ఉద్యోగాలలో అదనపు బాధ్యతలు, పనిభారం ఉంటుంది. వ్యాపార పెట్టుబడులు, వ్యాపారవిస్తరణ అవకాశాలు బాగుంటాయి. ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. ఆరోగ్య సమస్యల నుండి బయటపడతారు. అనుకున్న పనులు కొన్ని వాయిదాపడతాయి. మరికొన్నిటికి ఆటంకాలురావచ్చును. శుభకార్యాలలో పాల్గొనడం, దూరప్రయాణాలు ఖరారుకావడం జరుగుతుంది.


## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఆర్థిక వ్యవహారాలు, శుభకార్య చర్చలందు జాగ్రత్త వహించండి. వృత్తిపరంగా ప్రోత్సాహం బాగుంటుంది. వ్యాపారాలందు అర్థికావకాశాలు చేజారిపోవచ్చును. ఖర్చు జమ సరిపోతుంటుంది. వస్తు వాహన, గృహారిపేర్ల వంటి ఖర్చులుండగలవు. కుటుంబంలో సభ్యులకు అనారోగ్య బాధలుంటాయి. రావలసిన బాకీలు కొంత మేరకు అందుతాయి. దైవకార్యాలలో పాల్గొంటారు.


## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఆదాయ వ్యయాలు సంతృప్తికరంగా ఉంటాయి. వ్యాపారవర్గాలకు వ్యాపారవిస్తరణ, పెట్టుబడి అవకాశాలు లభిస్తాయి. అవసరాలకు ముందుగా డబ్బు ఏర్పాట్లు చేసుకొంటారు. ప్రభుత్వపరంగా అనుమతులు ఋణాలు మంజూరుకాగలవు. వృత్తిజీవనముగల చిరువ్యాపారులకు ఆర్థిక ఇబ్బందులు స్వల్పంగా ఉంటాయి. శుభ కార్యప్రయత్నాలలో ముమ్మరంగా పాల్గొంటారు.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వృత్తివ్యాపారాలలో పురోభివృద్ధి ఉండి, ఆకర్షణీయ పథకాలతో కొనుగోలుదారులను ఆకర్షిస్తారు. ఆదాయం పెరుగుతుంది. విలాసాలకు, కుటుంబ అవసరాలకు కొద్దిపాటి ఋణం కూడ చేయవలసి వస్తుంది. ఉద్యోగులు అధికారులతోను, పబ్లిక్‌తోను అప్రమత్తంగా ఉండండి. అనుకున్న పనులను పట్టుదలతో నెరవేర్చగలరు. కండరాలు నరాలకు సంబంధించిన బాధలుండవచ్చును.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

అనుకున్న పనులను సమర్థతతో జరుపుకొంటారు. పెట్టుబడులు వ్యాపార, వృత్తి విస్తరణకు అనుకూల సమయం. ఆదాయం పెరుగుతుంది. అయితే పెద్ద ఖర్చు ఒకటి పైనబడవచ్చును. ఉద్యోగులపైన, వ్యక్తిగతంగా పైనబడిన అపనిందలు అభియోగాలు తొలగిపోతాయి. అనుకున్న ప్రయాణాలు వాయిదాపడవచ్చును. సోదర, బంధువర్గంతో సత్సంబంధాలుంటాయి.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు.

## రాశి - మీ వాసి

తేది. 14.12.2012 నుండి
తేది. 20.12.2012 వరకు.

ఈవారం వృషభంలో గురుకేతువులు, తులలో శని, వృశ్చికంలో రవిబుధశుక్ర రాహువులు, 16 నుండి ధనుస్సులో రవి, ధనుస్సులో కుజుడు, 17 నుండి మకరంలో కుజుడు, ధనుర్మకర కుంభరాశులలో చంద్రుడు సంచరిస్తారు.

### పంచాంగము :

తేది 16 ఆదివారము నుండి ధనుర్మాసప్రారంభం శూన్యమాసముకాదు.


### ముహూర్తములు:

తేది 19 బుధవారము ఉదయం 10.23 నుండి 12.00లోగా కుంబలగ్నమున వ్యాపారం, అక్షరాభ్యాస, అన్నప్రాశనలు.

### మార్గశీర్షమాస శుక్ల పక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 14 | శుక్ర | పాడ్యమి | ప॥ గం.12.23వ॥ |
| తేది. 15 | శని | విదియ | ఉ॥ గం.10.10వ॥ |
| తేది. 16 | ఆది | తదియ | ఉ॥ గం.8.10వ॥ |
| | పిదప | పూర్తిగా | చతుర్థి |
| తేది. 17 | సోమ | పంచమి | రా॥ గం.4.54వ॥ |
| తేది. 18 | మంగళ | షష్ఠి | రా॥ గం.3.57వ॥ |
| తేది. 19 | బుధ | సప్తమి | రా॥ గం.3.18వ॥ |
| తేది. 20 | గురు | అష్టమి | రా॥ గం.3.25వ॥ |


## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

క్రయవిక్రయాలు నిర్ణయంకాగలవు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి బాగుండి ఆదాయం పెరుగుతుంది. వివాహ విద్యా విషయాలలో బిడ్డలవల్ల ఇబ్బందులుంటాయి. శుభకార్యాలలో పాల్గొంటారు. ప్రైవేటు సంస్థలలో పెట్టుబడులు, ఋణాలు ఇవ్వడం వంటి వాటిలో తొందర పనికిరాదు. షేర్లపై లాభాలుంటాయి. సోదరీసోదరవర్గానికి మేలు జరుగుతుంది.


## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

క్రొత్త పెట్టుబడులకు, వ్యాపారాలకు, నిర్మాణాలకు అవసరమైన వనరులు సమకూర్చుకొంటారు. సంస్థల నిర్వహణలో, అధికార విషయాలతో సముచిత నిర్ణయాలు తీసుకొంటారు. రావలసిన బాకీలు కొంతవరకు వసూలు కాగలవు. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా ఉంటాయి. దైవ, సామాజిక కార్యక్రమాలలో పాల్గొంటారు. షేర్లు లాభిస్తాయి. విద్యార్థులు పట్టుదలతో చదువుతారు.


## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

వృత్తి వ్యాపారాలలో మంచి అవకాశాలు చేజారిపోగలవు. గతంకంటే కొద్దిగ ఆదాయం తగ్గుతుంది. ఆర్థికాభివృద్ధి బాగా శ్రమపడవలసి ఉంటుంది. కోర్టు వ్యవహారాలు వాయిదాపడగలవు. ఖర్చులు పెరిగినా డబ్బుకు ఇబ్బంది ఉండదు. కఠినంగా, ఆవేశంగా మాట్లాడటం తగ్గించు కొనండి లేకుంటే తగాదాలు రావచ్చును. విలువైన వస్తువులు, కాగితాలు జాగ్రత్త చేసుకొనాలి.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

భూములు, స్థలాల కొనుగోలు విషయంలో తొందర పడవద్దు. నూతన వ్యాపారాలు, క్రొత్త పథకాలు అనుకూలించి అభివృద్ధి ఆదాయం బాగుంటుంది. వృత్తి నిర్వహణలో అవకాశాలు, గుర్తింపు గౌరవాలు బాగుంటాయి. ఆరోగ్య విషయంలో, ఆహార విషయంలో జాగ్రత్తగా ఉండండి. అనుకున్న పనులు కష్టంమీద జరుపుకొంటారు. ప్రముఖుల పరిచయాలు మేలుచేకూర్చగలవు.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ప్రభుత్వ అనుమతులు, ఉపాధి పథకాలు లభించే అవకాశం ఉన్నది. దైవసేవా కార్యములలో ప్రముఖంగా పాల్గొంటారు. వృత్తిపరంగా అభివృద్ధి ఉంటుంది. వ్యాపార పారిశ్రామిక యాజమాన్యాలకు విస్తరణ అవకాశాలు దొరకడం, ఆదాయం పెరగడం ఉంటుంది. షేర్లు స్థిరాస్తులు పెట్టుబడుల మీద లాభాలుంటాయి. శుభ కార్యాలు నిర్ణయంకాగలవు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

విధి నిర్వహణ సమర్థవంతంగా ఉండి, మంచి సూచనలు, సలహాలను అందిస్తారు. పనులు నిదానంగా జరుగుతాయి. వృత్తి వ్యాపారాలలో ఆదాయం అభివృద్ధి ఉంటుంది. శుభకార్యాలలో పాల్గొనడం, దూరప్రయాణాలు ఉండగలవు. క్రొత్త పెట్టుబడులకు, కాంట్రాక్టులకు అవకాశాలు లభిస్తాయి. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు మంజూరుకాగలవు.

### నరసింహకొండలో...

## గౌడసంఘం వనభోజనాలు

నెల్లూరు రూరల్‌మండలం నరసింహకొండపై ఏడుకొనేర్ల దగ్గర 8వ తేదీన నెల్లూరుజిల్లా గౌడ కల్లుగీత పారిశ్రామిక సంఘం ఆధ్వర్యంలో కార్తీక మాస వనభోజనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, పిల్లలకు ఆటలు, పాటల పోటీలు జరిపారు. సంఘం జిల్లాఅధ్యక్షులు కోసూరు గోవిందయ్యగౌడ్ మాట్లాడుతూ జిల్లాలో 1970దశకంలో గౌడ కుల సంఘం స్థాపించి రాష్ట్రంలో పేరు ప్రఖ్యాతులు పొందే విధంగా గౌడ సమస్యల పరిష్కారం, విద్య, వైద్యం తదితరాలు గౌడ కులస్థులకందే విధంగా కృషిచేశామన్నారు. గౌడ హాస్టల్ ఏర్పాటుచేసి వేలాది విద్యార్థుల ఉన్నతికి తోడ్పడ్డామని తెలిపారు. సంఘం ప్రధానకార్యదర్శి అయిటా మల్లిఖార్జునగౌడ్ మాట్లాడుతూ భవిష్యత్తులో మంచి కార్యక్రమాలు రూపకల్పన చేసి విద్యార్థులకు, యువతకు, గీత కార్మికులకు తోడ్పడతామని తెలిపారు.

కార్యక్రమంలో కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఛైర్మెన్ జానా రామచంద్రయ్యగౌడ్, జడపల్లి చంద్రయ్యగౌడ్, ఉప్పాల మాలకొండయ్య, పంది పెనుగొండయ్యగౌడ్, ముక్కు రమణయ్యగౌడ్ మొదలగువారు పాల్గొన్నారు.


## సమ్మెహక్కును కాలరాసింది

సమ్మెహక్కు లేకుండా చేసి ప్రభుత్వం ఉద్యోగులను కట్టుబానిసలుగా చేసిందని ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ ఉపాధ్యాయ జెఏసీ రాష్ట్ర ఛైర్మెన్ గోపాల్‌రెడ్డి విమర్శించారు. 9వతేదీ నెల్లూరు నగరంలోని ఎన్‌జీఓహోంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 2004సెప్టెంబరు ఒకటవ తేదీ తర్వాత విధుల్లో చేరిన ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులకు ప్రభుత్వం పెన్షన్ సౌకర్యం లేకుండా చేసిందన్నారు. రాష్ట్రంలోని కాంట్రాక్ట్ ఉద్యోగులనీ, కార్మికులనీ రెగ్యులరైజ్ చేయాలని, ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

సమావేశంలో ఏపీ పంచాయితీరాజ్ డిప్లమా ఇంజనీర్ల సంఘం అధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, పివీవీ సత్యనారాయణ, ఎం.వెంకటేశ్వర్లు, గూడూరు డివిజన్ ఎన్‌జీఓ అసోసియేషన్ ప్రెసిడెంట్ మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఏకతాటిపై...

## రజక సంఘాలు



బాలకోటేశ్వరరావు

జిల్లాలోని 8 రజక సంఘాలు 9వ తేదీన నెల్లూరు టౌనుహాలులో సమావేశమయ్యాయి. అన్ని సంఘాలు ఏకతాటిపై చేరి "రజక జన చైతన్య సంఘం"గా ఏర్పడ్డాయి. రజకుల ఐక్యతకు అభివృద్ధికి ఈ సంఘం కృషిచేస్తుందని సంఘం అధ్యక్షుడు పిటూరు బాలకోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వింజమూరు మస్తాన్‌బాబు, కోశాధికారి మనుసూరు శివబ్రహ్మంలు తెలిపారు. అనుభవజ్ఞులైన రజక నేతల సూచనలు, సలహాల మేరకు నూతన కమిటీ ఏకగ్రీవంగా జరిగిందని, అలాగే మహిళ, యువత, విద్యార్థి విభాగాలను జిల్లా, మండల స్థాయి కమిటీలను 2013 జనవరిలో ఏర్పరచడం జరుగుతుందని తెలిపారు.

సమావేశానికి అరికొండ హరిబాబు అధ్యక్షత వహించగా సీనియర్ రజకనేతలు ఉదయగిరి బ్రహ్మయ్య, చదులవాడ రమణయ్య, తుమ్మాపూరు వెంకటేశ్వర్లు, మన్నూరు శ్రీనివాసులు, ఒట్టూరు శ్రీనివాసులు, కరేటి కొండయ్య తదితరులు పాల్గొన్నారు.




## పెళ్లి సంబంధాలు

### వధువు కావలెను

1. 1986 ఫిబ్రవరి 11 జననం. ఎత్తు 5'10 1/2". చదువు బి.టెక్(ఎలక్ట్రానిక్స్), ఐ.యస్.బి. ఉద్యోగం మల్టినేషనల్ కంపెనీ(బెంగుళూరు). జీతం నెలకు 1,25,000/-. ఆస్తివిలువ 30కోట్లు. ఉన్నతమైనరెడ్డి ఉద్యోగకుటుంబం. స్వస్థలం చిత్తూరుజిల్లా ప్రస్తుతనివాసం హైదరాబాద్.
2. 1983 జనవరి 16 జననం. ఎత్తు 5'5". చదువు యం.బి.బి.యస్ మహబూబ్‌నగర్. యండి (జనరల్ మెడిసిన్)గుల్బర్గా. ఉన్నతమైన రెడ్డి వ్యాపారకుటుంబం. ఆస్తివిలువ 7కోట్లు. స్వస్థలం వనపర్తి, ప్రస్తుతనివాసం హైదరాబాద్.
3. 1980 సెప్టెంబరు 13 జననం. ఎత్తు 5'8". చదువు బి.డి.యస్(మణిపాల్) డి.డి.యస్(బోస్టన్) అమెరికా ఆస్తివిలువ 40లక్షలు. స్వస్థలం నెల్లూరుజిల్లా. ఉన్నతమైనరెడ్డి వ్యవసాయ కుటుంబం.
4. 1980 డిసెంబరు 28 జననం. ఎత్తు 5'5". చదువు యం.బి.బి.యస్(పూనా), యు.యస్.యం.యల్.ఇ(3స్టెప్‌లు) పాస్. అబ్జర్వర్‌షిప్ ఇన్ కార్డియాలజి(అల్ బామా) అమెరికా ఉన్నతమైన రెడ్డి ఉద్యోగకుటుంబం. ఆస్తివిలువ 20కోట్లు. స్వస్థలం అనంతపురంజిల్లా. ప్రస్తుతనివాసం ఢిల్లీ.
5. 1983 అక్టోబరు 29 జననం. ఎత్తు 6'1". చదువు బి.టెక్(ఇసిఇ), యం.యస్(టెలికమ్యూనికేషన్స్), ఉద్యోగం స్ప్రింట్‌నెక్స్టెల్ హెరెన్‌డాన్(అమెరికా) వర్జినియా. జీతం 120కె ఆస్తివిలువ 20కోట్లు. ఉన్నతమైనరెడ్డి ఉద్యోగకుటుంబం. స్వస్థలం మెదక్‌జిల్లా. ప్రస్తుతనివాసం హైదరాబాద్.

### వరుడు కావలెను

6. 1988 జూన్ 5 జననం. ఎత్తు 5'5". చదువు యం.బి.బి.యస్(యన్.ఆర్.ఐ కాలేజి, గుంటూరు) పిజి ఎంట్రెన్స్‌కు ప్రిపేరవుతుంది. ఉన్నతమైన రెడ్డి ఉద్యోగ కుటుంబం. ఆస్తివాటా 4కోట్లు. స్వస్థలం విశాఖపట్నంజిల్లా.
7. 1989 ఏప్రిల్ 16 జననం. ఎత్తు 5'1". చదువు బి.టెక్ కంప్యూటర్స్, ఉద్యోగం బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. జీతం నెలకు 30,000/-. ఉన్నతమైన రెడ్డి ఉద్యోగకుటుంబం. ఆస్తివిలువ 1కోటి. స్వస్థలం నెల్లూరుజిల్లా.
8. 1988 అక్టోబరు 25 జననం. ఎత్తు 5'2". చదువు బి.టెక్(ఇసిఇ). ఉద్యోగం ఇన్ఫోసిస్, హైదరాబాద్. ఆస్తివాటా 10కోట్లు. ఉన్నతమైన రెడ్డి వ్యాపారకుటుంబం. స్వస్థలం తూర్పు గోదావరిజిల్లా.
9. 1987 జూన్ 14 జననం. ఎత్తు 5'3". చదువు బి.టెక్ కంప్యూటర్స్(హైదరాబాద్), యం.యస్.సి(కాలిఫోర్నియా) అమెరికా. ఉన్నతమైన రెడ్డి వ్యాపారకుటుంబం. ఆస్తివాటా 10కోట్లు. ప్రస్తుతనివాసం హైదరాబాద్.
10. 1978 జనవరి 17 జననం. ఎత్తు 5'5". చదువు యం.సి.ఏ. ఉద్యోగం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, నెస్ టెక్నాలజీ, హైదరాబాద్. స్వస్థలం వరంగల్‌జిల్లా. ప్రస్తుతనివాసం హైదరాబాద్. ఆస్తివాటా 4కోట్లు. ఉన్నతమైన రెడ్డి ఉద్యోగకుటుంబం.

వివరాలకు: కొండూరు హరినారాయణరెడ్డి, 25-9-413, పోస్టల్‌కాలనీ, ఆంధ్రకేసరినగర్, నెల్లూరు - 4.

98480 34522
94406 39460.

ఫోన్ట్‌బాక్స్ నెం.4, C/o. లాయర్ జాతీయ తెలుగు వారపత్రిక, ప్లాట్ నెం. 1 & 2, మెయిన్‌రోడ్డు, మాగుంట లే-అవుట్, నెల్లూరు - 3.

# తొందరపడొద్దు

(మొదటిపేజీ తరువాయి)

వారికి అనుకూల రాజకీయ వాతావరణముంది. ప్రజలలో వై.యస్. అంటే అభిమానం అలాగే వుంది. జగన్ పట్ల సానుభూతి కనిపిస్తుంది. విజయమ్మ, షర్మిళ ప్రభావం పనిచేస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా చచ్చుగా తయారైంది. అన్నీ ప్రజావ్యతిరేక పనులకే పాల్పడుతూ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో రాష్ట్రంలో వైయస్సార్ కాంగ్రెస్ బలపడడానికి దోహదపడుతుంది. మరోపక్క చూస్తే ప్రతిపక్ష నేతగా చంద్రబాబు పూర్తిగా విఫలమయ్యాడు. అటు కాంగ్రెస్‌కు ఇటు తెలుగుదేశంకు పూర్తి ప్రత్యామ్నాయంగా వైకాపా నేత జగన్‌ను ప్రజలు అభిమానిస్తున్నారు. అయితే ఈ వాతావరణమే ఎల్లకాలం వుంటుందనుకుంటే పొరపాటే! రాజకీయాలలో ఎటువంటి అద్భుతాలైనా సాధ్యమే! ఈరోజు వరకు హీరోగా వున్న జగన్ రేపు విలన్ అయ్యే అవకాశాలు కూడా వుంటాయి. ఒక్క చిన్నపాయింట్ చాలు ప్రజల మైండ్‌సెట్ మారడానికి. కులం, మతం మన దేశంలో ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతుంటాయి.

ప్రజలు ఈవేళ వున్నట్లు రేపు వుండరు. ఈరోజు జగన్‌కి బ్రహ్మరథం పడుతున్నవారు రేపు తిరస్కరించినా ఆశ్చర్యం అవసరం లేదు. ఓటరుకి విశ్వాసం వుండదు. ఆత్మపరిశీలన అసలే వుండదు. నిజంగా అభివృద్ధికి, మంచితనానికి నేడు వారు పేర్కొంటున్న "రాజన్న" రాజ్యానికి ప్రజలు మనస్ఫూర్తిగా మద్దతు పలికి వుంటే 2009 ఎన్నికలలో కాంగ్రెస్‌పార్టీ అతికష్టం మీద గట్టెక్కే పరిస్థితి వుండేదికాదు. వై.యస్. అందించిన వరాలను, ఆయన పంచిపెట్టిన అభివృద్ధి ఫలాలని అనుభవించిన ఈ ఓటరు జనం 2009లో ఆయనకి పాస్‌మార్కులు మాత్రమే వేశారు. కాబట్టి రాష్ట్రంలో వున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలదోయడానికి వైకాపాకు ఇదే సరైన సమయం. మార్చిదాకా జగన్ జైలులో వుండాల్సిందే. ఆ తర్వాత బయటకు రావచ్చు. లేదా రాకపోవచ్చు కూడా! ఇది జగన్‌తో సంబంధం లేని వ్యవహారం. జగన్ మీద కాంగ్రెస్ అధిష్టానం తీవ్రస్థాయిలో కక్షగట్టింది. ఆయనను అన్ని విధాలుగా తొక్కేందుకు శతవిధాలా ప్రయత్నిస్తుంది. కాంగ్రెస్ అధిష్టానానికి ఇంకా అలాంటి అవకాశం ఇవ్వడం మూర్ఖత్వమే అవుతుంది. జగన్ 'ఊ' అంటే కాంగ్రెస్ నుండి బయటకు రావడానికి 30 నుండి 50మంది ఎమ్మెల్యేల దాకా సిద్ధంగావున్నారు. ఇంతపెద్ద సంఖ్యలో ఎమ్మెల్యేలు బయటకొచ్చారంటే ప్రభుత్వం కూలడం ఖాయం. ఆ తర్వాత ఎన్నికలలో వైకాపా హవా కొనసాగవచ్చు. అయితే ఆ పార్టీ నాయకులు ఊహల్లో తేలుతున్నట్లుగా 200సీట్లు దాటే పరిస్థితులు లేవు. తెలంగాణలో టీఆర్‌ఎస్‌తో గట్టి పోటీ తప్పదు. జగన్ ప్రభంజనం వుందనుకున్నప్పటికీ మొన్నటి పరకాల ఉపఎన్నికలలో రాజీనామా చేసిన కొండా సురేఖ ఓడిపోవడం చూసాం. వైకాపా బలంగా వుందనుకున్న నెల్లూరుజిల్లా కోవూరు ఉపఎన్నికలలో వైకాపా అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి అనుకున్నంత మెజార్టీ రాలేదు. ఎప్పటి మేలు అప్పుడే. కాంగ్రెస్‌ను కూలదోయడానికి, ప్రజల్లో వున్న అభిమానాన్ని అధికారంగా మలచుకోవడానికి జగన్‌కు ఇదే సరైన సమయం. బెయిల్ వచ్చినా రాకున్నా మార్చే లక్ష్యంగా మార్చిలో పావులు కదపడమే సముచిత నిర్ణయమౌతుంది. పారాహుషార్.

# పాపం యన్.టి.ఆర్

(మొదటిపేజీ తరువాయి)

మాటల యుద్ధానికి దారితీసింది. ఆయన విగ్రహాన్ని పార్లమెంటులో ప్రతిష్ఠించటం నిజంగా తెలుగువారి ఆత్మగౌరవానికి పార్లమెంట్‌లో పెద్దపీఠం వేయటమే.

ఆయన బ్రతికున్నపుడు, చనిపోయినపుడు, చనిపోయిన ఇన్నేళ్ళ తర్వాత కూడా ఆయన పేరు చెప్పుకోకుండా రాజకీయాలు చేయలేని వారంతా, ప్రస్తుతం పార్లమెంటులో ఆయన విగ్రహ ప్రతిష్ఠాపనను వివాదాస్పదం చేసి ఏదో బావుకోవాలనుకుంటున్నారు. అనవసరపు వ్యాఖ్యలు, వ్యాఖ్యానాలు, లేఖలతో 2000 నుంచి ఇప్పటి వరకూ సాగదీస్తున్నారు. ఇప్పుడు ప్రఛ్చన్నయుద్ధం కాస్తా ప్రత్యక్షయుద్ధంగా మారింది. ఇంతకంటే దౌర్భాగ్యమైన పరిస్థితి ఆయన కుటుంబానికి రాకూడదని అభిమానులు ఆవేదనపడ్తున్నారు.

చంద్రబాబు విగ్రహాన్ని ఇవ్వలేదు. రాష్ట్ర ప్రభుత్వం తరపున వైయస్‌ఆర్ నిరాకరించారు, విగ్రహ ప్రతిష్ఠాపనకు పురంధేశ్వరి మోకాలడ్డింది వంటి ఆరోపణలు, ప్రత్యారోపణలు, లేఖాస్త్రాలు సంధించుకుంటూ అటు తెలుగుదేశం నాయకులైన చంద్రబాబునాయుడు, బాలకృష్ణ ఇటు దగ్గుబాటి పురంధేశ్వరి, వెంకటేశ్వరరావులు దివంగత యన్టీఆర్ ప్రతిష్ఠను వీధుల్లోకి తెచ్చారు. ఆయన విగ్రహం ఖరీదెంతైనా, రాష్ట్ర ప్రభుత్వమే ఇవ్వాల్సిన అవసరంలేదు. తెలుగు ప్రజలకు ఒక పిలుపు ఇస్తే ఏరోజుకారోజు కూలీ చేసుకొనే కుచేలుల నుంచి, కోట్లాది ఆస్తులు గల అపరకుబేరుల వరకూ తలా కొంత వేసుకుంటారు. బంగారుతో చేసిన విగ్రహాన్నే పార్లమెంట్‌లో పెట్టొచ్చు. ఎవరు ఏ గాడిద పళ్లా తోమాల్సిన అవసరములేదు. సంతకాలు చేయాల్సిన దౌర్భాగ్యములేదు. పాపం రామారావు గతించి కూడా వీరి నీచ రాజకీయాలకు పావుగా ఉపయోగపడ్తున్నాడు. చిత్తశుద్ధి లేకుంటే అంతే.

# మోక్షంతోనే రక్షణ

(మొదటిపేజీ తరువాయి)

చేస్తున్నట్లు గతంలోనే నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి ప్రకటించి వున్నారు. దీనికి సంబంధించి సుమారు రూ.10కోట్ల రూపాయల అంచనాలతో టెండర్లు కూడా పిలిచారు. ఓ పక్క అధికారులు మినీబైపాస్ రోడ్డును ఆరులైన్లుగా విస్తరించే ప్రయత్నాల్లో వుండగా, మరోపక్క మాత్రం నిబంధనలకు విరుద్ధంగా మినీబైపాస్‌కు ఇరువైపులా కమర్షియల్ కాంప్లెక్స్‌లను నిర్మిస్తూనే వున్నారు. రేపు రోడ్డును విస్తరించాలంటే చాలాభవనాలను ముందు భాగంలో తొలగించాల్సి వస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా రియల్‌ఎస్టేట్ మార్కెట్ పడిపోయినా నెల్లూరు మినీబైపాస్‌లో మాత్రం రియల్ జోష్ కొనసాగుతుంది. ఈ రోడ్డుకు ఆనుకుని వున్న స్థలాలు అంకణం 10 నుండి 15లక్షల దాకా రేటు పలుకుతున్నాయి. కాబట్టే స్థలాలు కొన్నవాళ్ళు మున్సిపల్ నిబంధనలను తుంగలో తొక్కి ముందు భాగంలో అంగుళం కూడా వదలకుండా కట్టేస్తున్నారు. వీటిని కట్టాక పగలగొట్టడం కంటే, కట్టకముందే అడ్డుకోవడం మంచిది. దానివల్ల భవన యజమానులు నష్టపోరు. ప్రభుత్వానికి నష్టపరిహారం చెల్లించే భారం వుండదు.

కాబట్టి మినీ బైపాస్‌కు ఆనుకుని నిర్మిస్తున్న భవనాల ప్లాన్స్‌ను ఆరులైన్ల విస్తరణను దృష్టిలో పెట్టుకుని నగరపాలక సంస్థ అధికారులు ఆమోదించాల్సి వుంది. కనీసం మినీబైపాస్‌నన్నా ఆక్రమణలమయం కాకుండా అరికట్టగలిగితే భవిష్యత్‌లో ట్రాఫిక్ సమస్యలుండవు.

# విచారమేనా?

(5వ పేజీ తరువాయి)

జిల్లాలో తనశాఖ కోట్లు దోచేసిందనే సరికి ఆయనకు ఒళ్లు జలదరించింది. డీఎస్పీని వీఆర్‌కు పంపేశాడు. సిట్ చేతికి పగ్గాలిచ్చాడు. ఇక్కడి వరకూ బాగానే వుంది. అసలు వసూలైన మొత్తం, దిగమింగిన సొత్తు ఎప్పటికి జమయ్యేనో..? ఇది సామాన్యుని ప్రశ్న. ఇప్పటివరకూ స్వాధీనం చేసుకున్న వందలకోట్ల డబ్బు, ఆస్తులు, కార్లు ఎక్కడెక్కడ ఏవిధంగా వున్నాయి. అసలు ఇంత చేసి అత్యాశకుపోయిన మదుపరులకు రూపాయికి 10పైసలైనా అందుతుందా? అసలు మొత్తం మనీస్కీం వెనుకనున్న సూత్రధారులెవరు? దయాన్ మీద వున్న రాజకీయ పాత్రధారులెవరు ఇవన్నీ సమాధానాలు అందని ప్రశ్నలే. చివరాఖరుగా ఏమి జరిగినా ఫ్రీగా వస్తుందని ఫినాయిలు త్రాగిన జనానికి డయేరియా మాత్రమే పట్టుకుంది.

# కల్యాణ వైభవం!



స్వర్గీయ యం.యస్.రెడ్డికి ప్రియశిష్యుడు, జయంపు వాస్తవ్యుడైనందున జయంపు కృష్ణగా ప్రసిద్ధి చెందిన ప్రముఖ రచయిత చీకోలు కృష్ణయ్య - రాజేశ్వరికృష్ణల కుమారుడు కీర్తికృష్ణ - అమల (ఏటూరు రాము-పరమేశ్వరిల కుమార్తె)ల వివాహం ఈ నెల 8వ తేదీ నెల్లూరు జి.పి.ఆర్.గ్రాండ్ కల్యాణ మండపంలో వైభవంగా జరిగింది. నూతనదంపతులకు'లాయర్' శుభాకాంక్షలు.



నెల్లూరు నగరం లేక్‌వ్యూకాలనీకి చెందిన వాసిరెడ్డి చంద్రనాగ్ కుమార్ సోదరుడు నరేంద్రబాబు - సుస్మితల కల్యాణం ఈ నెల 8వ తేదీ నెల్లూరు ఎం.వి.ఎస్. కల్యాణ మండపం నందు జరిగింది. కొత్తజంటకు 'లాయర్' శుభదీవెనలు.



తోటపల్లిగూడూరులోని గణేష్ ఫిల్లింగ్‌స్టేషన్ యజమాని నిమ్మల శ్రీనివాసులు బావమరిది (తిరకాల రమణయ్యగౌడ్ - హైమావతిల కుమారుడు) చిరంజీవి - జయలక్ష్మిల పెళ్లి ఈ నెల 5వ తేదీ నెల్లూరు పరమేశ్వరి కల్యాణ మండపం నందు వైభవంగా జరిగింది. కొత్తదంపతులకు 'లాయర్' శుభాభినందనలు.

# నిరుత్సాహం

(2వ పేజీ తరువాయి)

శ్రీధరకృష్ణారెడ్డి వున్నా, సహకార ఎన్నికలలో ఆయనకు పనితక్కువ. గూడూరు డివిజన్‌ను పనబాక కృష్ణయ్య, వాకాటి నారాయణరెడ్డిలే చూసుకోవాలి. మొన్న మహిళా కమీషన్ ఛైర్మెన్ పదవి ఇవ్వకపోవడంతో నేదురుమల్లి రాజ్యలక్ష్మి కూడా అంత హుషారుగా లేదు. కావలి డివిజన్‌లో చూస్తే మాగుంట పార్వతమ్మ రాజకీయాలకు దూరంగా వుంటుంది. కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి పట్ల వ్యతిరేకత వుంది. పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, కంభం విజయరామిరెడ్డి, మాదాల జానకిరాం వంటి నాయకులు కొంత నెట్టుకు రాగలరు. మొత్తానికి సహకార ఎన్నికలు కాంగ్రెస్‌కు అగ్నిపరీక్షే!

# రాధాకృష్ణుల విగ్రహాల ప్రతిష్ఠ



నెల్లూరు ఇస్కాన్ మందిరం పర్యవేక్షణలో కార్తీకమాసం, మాసశివరాత్రిని పురస్కరించుకొని నెల్లూరు గాంధీబొమ్మ కూడలిలో తాత్కాలికంగా రాధాకృష్ణుల విగ్రహాలను బుధవారం ప్రతిష్ఠించారు. భారీగా హాజరైన భక్తులు కార్తీకదీపాలు వెలిగించి రాధాకృష్ణులను భక్తితో దర్శించుకున్నారు. ఇస్కాన్‌మందిర నిర్వాహకులు సుఖదేవ్‌స్వామి ఆధ్వర్యంలో భక్తబృందం "హరే రామ, హరేకృష్ణ, కృష్ణకృష్ణ హరేహరే" అంటూ కృష్ణనామంతో పాటు భజనలు జరిపారు.


PDF Compressor Free Version

PDF Compressor Free Version



# మూ'వీ'క్షణం





## భాయ్ టీమ్ బిజీ

అక్కినేని నాగార్జున హీరోగా నటిస్తున్న కామెడీ ఎంటర్‌టైనర్ జనవరి నుండి సెట్స్‌మీదకు వెళ్లనుంది. ఈ చిత్రం లొకేషన్స్ కోసం సినిమా టీమ్ బ్యాంకాక్ వెళ్లింది. 'పూలరంగడు'తో హిట్ కొట్టిన వీరభద్రచౌదరి ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమాకు దేవిశ్రీప్రసాద్ సంగీతమందిస్తుండగా, రిచాగంగోపాధ్యాయ హీరోయిన్‌గా నటిస్తుంది.



## వంటంటే మంట

అందాలభామ సమంత ఇప్పుడు తెలుగు ఇండస్ట్రీని ఏలుతుంది. నటనలో వున్న టాలెంటు ఆమెకు వంట చేయడంలో లేదంట! కనీసం కాఫీ పెట్టడం కూడా చేత కాదంట. తన తల్లి వంటలు చేసేటప్పుడు నేర్చుకునేందుకు ప్రయత్నించినా ఆమెకవి వంటబట్ట లేదట! ఇప్పుడు వండడం అవసరం లేకపోయినా భవిష్యత్‌లో తప్పదేమో!



## యముడికి మొగుడొస్తున్నాడు

అల్లరి నరేష్, నూతన తార రిచా పనయ్ జంటగా నటించిన 'యముడికి మొగుడు' సినిమా ఈ నెల 22న విడుదలకు సిద్ధంగా వుంది. గ్రాఫిక్స్ పనులు తుది దశకు చేరు కున్నాయని, 74 నిమిషాల గ్రాఫిక్స్ సన్ని వేశాలు ఈ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని నిర్మాత చంటి అడ్డాల అంటున్నారు. పాటలు కూడా బాగా వచ్చాయట! ఈ చిత్రంలో యముడిగా షియాజీ షిండే, అతని భార్యగా రమ్యకృష్ణ, చిన్న యముడుగా భరత్ నటించారు.



## అవకాశాలు తగ్గినా అభిమానులు తగ్గలేదు

ఈమధ్యకాలంలో త్రిషకు సినిమాలు బాగా తగ్గాయి. అయితే అభిమానులు మాత్రం తగ్గలేదు. సమంత, కాజల్, నయనతార, తమన్నా వంటి హీరోయిన్లను పక్కకు నెట్టి మొబైల్స్‌లో అత్యధికంగా డౌన్‌లోడ్ చేయబడ్డ దక్షిణభారత సెలబ్రిటీగా త్రిష గుర్తింపు పొందింది. ఎయిర్‌టెల్ మొబిట్యాడ్ 2012 నిర్వహించిన సర్వేలో త్రిష బాలీవుడ్ స్టార్స్‌ను సైతం వెనక్కినెట్టింది.



## మార్కెట్‌లోకి.. స్టార్ల జీవితాలు

సూపర్‌స్టార్ రజనీకాంత్ అంటే తమిళనాట అభిమానులకు పిచ్చి. ఆయన జీవితచరిత్రను తమిళవాసులకు అందుబాటులోకి తెచ్చారు ఫిలిం జర్నలిస్ట్ అయిన సుమన్ రామచంద్ర. దీనికి "రజనీకాంత్ ది డెఫినిటివ్ బయోగ్రఫీ" అని పేరుపెట్టారు. అలాగే తెలుగు మెగాస్టార్ చిరంజీవి బయోగ్రఫీ కూడా 'మెగా చిరంజీవితం' పేరుతో మార్కెట్‌లోకి వచ్చింది. ప్రముఖ జర్నలిస్ట్ పసుపులేటి రామారావు ఈ పుస్తకాన్ని రచించారు. చిరంజీవి గురించి తెలుసుకోవాలనుకొనేవారికి ఈ పుస్తకం ఉపయోగపడుతుంది.

# గూడూరు డివిజన్ వార్తలు

## భగవంతుడి రాతే భగవద్గీత




భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలలో పాల్గొన్న చిన్నారులు

గూడూరు పట్టణంలోని అళఘునాథస్వామి ఆలయంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో 9వ తేదీ భగవద్గీత పఠన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీల నిర్వాహక కన్వీనర్ మల్లెమాల మురళీరెడ్డి మాట్లాడుతూ భగవద్గీత సారాంశాన్ని ప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్నారు. భారతదేశ సంస్కృతి సంప్రదాయాలను విదేశాలు గౌరవిస్తుంటే మనం మాత్రం విదేశీ సంస్కృతిని స్వీకరిస్తుండడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు మురళీరెడ్డి, వంగా ప్రసాద్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, మోమిడి శ్రీనివాసులు, విళ్లారి మధుసూదన్, మహేశ్వరరావు, సుబ్బరామిరెడ్డి, రవిచంద్రారెడ్డి, అశోక్‌కుమార్, లావణ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

## నల్లపూతను తొలగించాలి

### నాలుగుచక్రాల వాహనదారుల అద్దాలపై సిఐ సత్యనారాయణ

గూడూరు పట్టణంలోని నాలుగు చక్రాల వాహనదారులు అద్దాలపై నల్లపూతను తొలగించుకోవాలని పట్టణ సిఐ ఉప్పాల సత్యనారాయణ కోరారు. పట్టణంలోని టవర్‌క్లాక్ సెంటర్‌లో వాహనదారులకు 9వ తేదీ ఆయన అవగాహన కల్పించారు. భద్రతదృష్ట్యా వాహనాల అద్దాలపై నల్లపూతను తొలగించాలని సుప్రీంకోర్టు ఆదేశాలను జారీచేసిందని తెలిపారు. ఈమేరకు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తొలగింపు ప్రక్రియ ప్రారంభమైందని, అందులో భాగంగానే జిల్లాలోనూ నల్లపూత తొలగింపుపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. అనంతరం వాహనాల నెంబర్లు నోటు చేసుకొని మళ్లీ కనిపించినప్పుడు అద్దాలపై నల్లపూత లేకుండా చూసుకోవాలని హెచ్చరించారు. ఆయన వెంట టూటౌన్ ఎస్సై అంకిములావు తదితరులు ఉన్నారు.

## పిఆర్ క్లబ్ సేవలను.. మరింత విస్తృతం చేయాలి

- సబ్‌కలెక్టర్, డీఎస్పీ

గూడూరు పిఆర్ క్లబ్ సేవలను మరింత విస్తృతం చేయాలని సబ్‌కలెక్టర్ నివాస్, డీఎస్పీ సురేష్‌కుమార్‌లు కోరారు. పట్టణంలోని పెల్లేటి రామిరెడ్డి క్లబ్‌లో నూతనంగా నిర్మించిన రెండు భవనాలను బుధవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 120ఏళ్ల ఘనచరిత్ర కలిగిన పీఆర్‌క్లబ్ ఇప్పటికీ పలు సేవాకార్యక్రమాలు చేపడుతుందన్నారు. దాతల సాయంతో సేవలను మరింత విస్తృతం చేయాలని వారు కోరారు. క్లబ్ అధ్యక్షుడు ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ అందరి సహకారంతో సేవలను మరింత విస్తృతం చేస్తామని అన్నారు. అనంతరం 2013 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ సుశీలమ్మ, మున్సిపల్ డి.ఇ సీతారామారావు, క్లబ్ సెక్రటరీ మస్తాన్‌రెడ్డి, ట్రెజరర్ లక్ష్మీనారాయణ, సభ్యులు జనార్ధన్, శ్రీనివాసులు, శివకుమార్, జీడిరెడ్డి, కే.ఎస్.రెడ్డిలు పాల్గొన్నారు.



నూతన భవనాలను ప్రారంభిస్తున్న సబ్‌కలెక్టర్, డీఎస్పీ

## వాసవీ ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు



కార్తీకమాసాన్ని పురస్కరించుకుని బజారువీధిలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో 9వ తేదీ సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే జ్యూవెలరీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సాయిబాబా మందిరంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై తీర్థప్రసాదాలను స్వీకరించారు.

## • రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలి

గ్రామాల్లో నెలకొన్న రెవెన్యూ సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని గూడూరు సబ్‌కలెక్టర్ జె.నివాస్ డివిజన్‌లోని మండల తహశీల్దార్లను ఆదేశించారు. ప్రతి సోమవారం డివిజన్ నలుమూలల నుండి అధిక సంఖ్యలో అర్జీదారులు సబ్‌కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని తమ సమస్యలను పరిష్కరించాలని కోరడంతో సబ్‌కలెక్టర్ స్పందించి ఈమేరకు తహశీల్దార్లను ఆదేశించారు. గ్రామస్థుల నుండి వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి దానిపై తీసుకొన్న నిర్ణయాన్ని గ్రామస్థుల సమక్షంలో ఫిర్యాదుదారులకు తెలియచేయాలని ఆయన ఆదేశించారు.



హైదరాబాద్ మార్గంలో ప్రైవేట్ ట్రావెల్స్‌దే హవా

బస్సులు నడపడంలో వెనకబడ్డ ఆర్టీసీ



# ప్రై'వేటు'తో ఆదాయానికి చేటు!

ఆర్టీసీని ఆదాయాల బాట పట్టించడానికి బిందెల కొద్ది చెమట కార్చుకుంటూ కష్టపడుతున్నామని రాష్ట్రస్థాయి ఆర్టీసీ యాజమాన్యం దగ్గర్నుండి క్రింది స్థాయి అధికారుల వరకు ప్రకటనలు గుప్పిస్తూనే వుంటారు. మరి రాష్ట్రంలోని వివిధ ప్రైవేట్ ట్రావెల్స్ ఏజన్సీలు ఆదాయాల మార్గంలో వుండగా, దేశంలోనే అతిపెద్ద రవాణాసంస్థగా గుర్తింపు పొందిన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రోడ్డురవాణా సంస్థకే నష్టాలు ఎందుకొస్తున్నాయన్నది అంతుచిక్కని ప్రశ్న. ఆదాయాలొచ్చే మార్గాలను ప్రైవేట్‌కు ధారాదత్తం చేస్తే నష్టాలు రాకుండా వుంటాయా?

ప్రైవేట్ ట్రావెల్స్‌లాగా ఆర్టీసీని పూర్తి ఆదాయం వచ్చే రూట్లకే పరిమితం చేయలేరు. ప్రజారవాణాకు సౌకర్యంగా వుండాల్సిన సంస్థ కాబట్టి అన్ని రూట్లలో ఆర్టీసీ బస్సులను నడపాల్సిందే! కాని అదే సమయంలో ఆదాయం బాగుండే రూట్లలో కూడా నడపొచ్చు. ఆ విధంగా నడిపితే నష్టాలను పూడ్చుకోవచ్చు. కాని లాభాలొచ్చే రూట్లలో ఇప్పుడు ప్రైవేట్ ట్రావెల్స్ హవా నడుస్తుంది.

> **ఆర్టీసీ నష్టాల్లో వుంది... ఆర్టీసీని లాభాలబాట పట్టించాలి... ఆర్టీసీని ఒడ్డున పడేయాలి... ఆదాయం కోసం లీజుకు ఆర్టీసీ ఆస్తులు... పత్రికలలో తరచూ ఈ వార్తలు చూస్తూనేవుంటాం. అయినా మన ఆర్టీసీ ఎప్పుడూ నష్టాల బాట.. కష్టాల పాట!**

నెల్లూరు నుండే తీసుకుంటే... ఇక్కడనుండి ప్రతి రోజూ హైద్రాబాద్‌కు వెళ్లే బస్సులలో ప్రైవేట్ ట్రావెల్స్‌దే పైచేయిగా వుంది. నెల్లూరు-హైద్రాబాద్‌ల మధ్య ప్రతిరోజూ వేలసంఖ్యలో ప్రయాణాలు సాగిస్తుంటారు. నెల్లూరు నుండి హైద్రాబాద్‌కు రాత్రి సమయంలో హైద్రాబాద్ ఎక్స్‌ప్రెస్, ఛార్మినార్, పద్మావతి, నారాయణాద్రి, సింహపురి ఎక్స్‌ప్రెస్ వంటి రైళ్లు అందుబాటులో వున్నాయి. అయితే వారం పదిరోజులు ముందుగా రిజర్వేషన్ చేయించుకుంటే తప్పితే అప్పటికప్పుడు హైద్రాబాద్ పోవాలనుకునే వారికి ఈ రైళ్లలో రిజర్వేషన్ దొరకదు. పండుగల సీజన్‌లో అయితే నెల ముందే రిజర్వేషన్‌లు భర్తీ అయ్యుంటాయి. కాబట్టి అప్పటికప్పుడు హైద్రాబాద్‌కు ప్రయాణం పెట్టుకున్న వారు బస్సులనే ఆశ్రయించాల్సి వస్తుంది. బస్ జర్నీ అంటే ఎవరైనా ముందుగా ఆర్టీసీ గురించి ఆలోచిస్తారు. నెల్లూరులో మాత్రం మినీబైపాస్ లేదా రైల్వేస్టేషన్ రోడ్డులో వున్న ప్రైవేట్ ట్రావెల్స్ ఏజన్సీల వద్దకు పరుగులు తీస్తున్నారు. హైద్రాబాద్‌కు ఆర్టీసీ బస్సులు తక్కువ. వాటిలో కూడా వోల్వో బస్సు ఒకటే వుంది. 'ఇంద్ర' ఏ.సి. బస్సు ఒకటుంది. మిగిలినవి సూపర్‌లగ్జరీ బస్సులే! నెల్లూరు నుండి నేరుగా హైద్రాబాద్‌కు వెళ్లేవాళ్లు సూపర్‌లగ్జరీ బస్సులకు ప్రాధాన్యతనివ్వడం లేదు. వాళ్లు ప్రైవేట్ నాన్‌ఏ.సి బస్సుల వైపే మొగ్గుచూపుతున్నారు. ఎందుకంటే సూపర్ లగ్జరీ బస్సులకు అక్కడక్కడా స్టాపింగ్‌లుంటాయి. ప్రైవేట్ బస్సులకు ఒకటి, ఆరా తప్పితే ఎక్కడా స్టాపింగ్ వుండదు. ఏ.సి బస్సులు ఆర్టీసీలో తక్కువ. నెల్లూరులో కేశినేని, కావేరి, కామాక్షి, సింధు, కాళేశ్వరి, సింహపురి, నవీన్, రాజేష్, ధనుంజయ, ఎస్ఆర్ఎం, ఎస్‌విఆర్ వంటి ట్రావెల్స్ వున్నాయి. వీటి ద్వారా దాదాపు 20దాకా వోల్వోబస్సులు హైద్రాబాద్‌కు నడుస్తున్నాయి. ప్రతిరోజూ ఇవి పూర్తి ప్రయాణీకులతో నడుస్తున్నాయి. మరి ఆర్టీసీ కూడా ఇదే విధంగా హైద్రాబాద్‌కు నాన్‌స్టాప్ ఏసి బస్సులను నడిపితే ప్రైవేట్‌గా పోయే ఆదాయమేదో ఆర్టీసీకే వస్తుంది కదా!

# కల్యాణ వైభవం!



డాక్టర్ పెళ్ళకూరు జయప్రద, డాక్టర్ జె.పి.రెడ్డిల సోదరుడు, చెన్నైలో స్థిరనివాసం వుంటున్న పెళ్ళకూరు వెంకటసుబ్బారెడ్డి మనుమడు(కుమార్తె కొడుకు) సాయిరాం - సునయన (జస్టిస్ నాగార్జునరెడ్డి కుమార్తె)ల కల్యాణం హైదరాబాద్ శంషాబాద్‌లోని మొఘల్ గార్డెన్స్‌లో వైభవంగా జరిగింది. రాష్ట్ర గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డిలు హాజరై దంపతులను దీవించారు. నూతనదంపతులకు'లాయర్' శుభాకాంక్షలు.



బిఎంఆర్ సంస్థల జనరల్ మేనేజర్(ఆపరేషన్స్) దొడ్ల వేణుగోపాలరెడ్డి - వంశీప్రియల కుమార్తె సాయి స్నేహప్రియ - విక్రమ్‌కృష్ణారెడ్డి(జెట్టి రాజేంద్రప్రసాద్‌రెడ్డి - ఉషల కుమారుడు)ల వివాహం డిసెంబర్ 8వ తేదీ నెల్లూరు కస్తూరిదేవి గార్డెన్స్ నందు ఘనంగా జరిగింది. కొత్తజంటకు 'లాయర్' శుభాభినందనలు.

# శుభసంకల్పంతో సాగిన శాంతియజ్ఞం

అందరూ సంతోషంగా వుండాలి. అంతటా సుభిక్షంగా వుండాలన్న సంకల్పంతో నెల్లూరు పురమందిరం ఆవరణలో కుర్తాళం పీఠాధిపతి నేతృత్వంలో వేదపండితులు మాచవోలు రాజశేఖరశాస్త్రి, రమేష్‌శర్మ మొదలగు పండితుల మంత్రోచ్ఛారణతో శాంతి యజ్ఞాలు ఈనెల 8న ప్రారంభమై మూడు రోజుల పాటు వైభవంగా జరిగాయి. 16 అడుగుల శివలింగం రూపొందించి, 18నదుల జలాలను, కాశీ నుంచి తెచ్చిన రుద్రాక్షలను తల్పగిరి రంగనాథస్వామి ఆలయం నుంచి తీసుకువచ్చి పూజలు నిర్వహించారు. యాగశాలలో 1116శివలింగాలను ఆవాహనచేసి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు జరిపారు. సాయంత్రం 1116 జ్యోతులను శివలింగాకారంలో వెలిగించి నరఘోషశాంతి, సుదర్శనయాగం, జరిపారు. రాత్రికి కుబేరహోమం, సరస్వతీహోమం, శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. మరుసటి రోజు ఉదయం వేదపండితులు హోమాలను నిర్వహించి భారీ శివలింగంతో పాటు 1116 శివలింగాలను దీప, దూప నైవేద్యాలు సమర్పించిన అనంతరం యాగశాలను శుద్ధి చేశారు. భక్తదంపతులు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొనగా, రుద్ర, చండీయాగాన్ని, నవగ్రహహోమాలను జరిపారు. సాయంత్రం ప్రకాశంజిల్లా మార్కాపురం నుంచి వచ్చిన అంబా మల్లేశ్వరనాగ వీరాంజనేయస్వామి దేవస్థానం భజనమండలి భజనలు చేస్తుండగా ఆ దేవదేవుని నామస్మరణతో పురమందిరం మార్మోగింది. తదుపరి నరఘోష శాంతియాగం, ప్రత్యంగిరా హోమం, శత్రుసంహారక సుదర్శన యాగం, కుబేర హోమాలు జరిపి చిన్నపిల్లలకు సరస్వతీ మంత్రోపదేశం చేశారు. రాత్రి జరిగిన పార్వతీ పరమేశ్వరుల కల్యాణంలో విరివిగా దంపతులు పాల్గొన్నారు. శాంతియజ్ఞం ముగింపు రోజైన ఆఖరి కార్తీక సోమవారాన క్రిక్కిరిసిన భక్తసందోహం మధ్య భారీ శివలింగం, 1116 శివలింగాలకు మహాభిషేకాన్ని, కాశీ నుంచి తెప్పించిన లక్షరుద్రాక్షలతో లక్షార్చన నిర్వహించి భక్తులకు ఆ రుద్రాక్షలను పంచారు. మధ్యాహ్నం అన్నదానం జరిపి సాయంత్రం స్వామిని రథంపై నిలిపి, 1116శివలింగాలను భక్తులు తమ శిరస్సులపై పెట్టుకొని శివశివశంకర, శంభో హరహర అంటూ కీర్తిస్తూ ఊరేగింపుగా పవిత్ర పినాకినీ నది వద్దకు చేరి భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. ఈ మూడురోజుల పాటు కుర్తాళం పీఠాధిపతి సిద్దేశ్వరానంద భారతీ మహాస్వామి అనుగ్రహభాషణం చేయగా, వేదపండితుల మంత్రోచ్ఛారణ, విశేష పూజల నడుమ భక్తులు ఆధ్యాత్మిక ఆనందంతో తన్మయులయ్యారు.



1116 శివలింగాలను నిమజ్జనానికి తీసుకెళుతున్న భక్తులు

# అవినీతిదే రాజ్యం



## 'యువపథం'లో నేటి యువత మనోగతం

దేశంలో ఎక్కడచూసినా అవినీతే రాజ్యమేలుతుందని, లంచగొండితనం పెరిగిపోయిందని నారాయణ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు ముక్తకంఠంతో తమ అభిప్రాయాన్ని వ్యక్తపరచారు. యువతను జాగృతిపరచే కార్యక్రమంలో భాగంగా "యువపథం" రాష్ట్ర కన్వీనర్ పి.శ్రీకాంత్‌రెడ్డి సారథ్యంలో చర్చాగోష్ఠిని నారాయణ కాలేజీలో నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో తమ అభిప్రాయాలను నిర్మొహమాటంగా వ్యక్తపరచిన విద్యార్థులు దేశం అవినీతితో, స్కాములతో, లంచగొండితనంతో అల్లాడిపోతుందని, కలుషితమైపోయిన నేటి రాజకీయ వ్యవస్థలో ముఖ్యమంత్రుల కొడుకులు లేదా వారి బంధువులే మళ్లీ పదవులలోకి వస్తున్నారని, సామాన్యుడికి యువతకి, మేధావులకి రాజకీయాలలో స్థానం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాధనాన్ని లక్షల కోట్లలో దోచుకుని జైళ్లలో వున్నవారు సైతం రాజభోగాలు అనుభవించడం ఈ దేశ దౌర్భాగ్యంగా పేర్కొంటూ, అవినీతిలో కూరుకుపోయిన ప్రభుత్వాలు సైతం ఇలాంటి దేశద్రోహులకి కొమ్ముకాస్తున్నాయని తమ ఆవేదనని అక్కడి యువతరం వ్యక్తం చేసింది.

Edited, Published, Printed & owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003 Ph:2323485. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Executive Editor-G.SREENIVASULU REDDY.